teenmaardesk@gmail.com
RNI no TELTEL/2021/86151

# తీన్మార్

నేటి వాస్తవాలు... తెలుగు దిన పత్రిక

ములుగు | సంపుటి: 04 | సంచిక: 279 | చీఫ్ ఎడిటర్ : రెడ్డి శేఖర్ | పేజీలు : 8 | బుధవారం 15 ఏప్రిల్ 2026 | వెల : 5-00

Published rom Mulugu Circulated by Warangal, Khammam, Hyderabad, Nalgonda, Mahabubnagar, Rangareddy,Medak, Karimnagar, Nizamabad, Adilabad

## సమ్మె నిర్ణయం సరైంది కాదు

చర్చలకు ప్రభుత్వం సిద్ధం

ఆర్టీసీ కార్మికులకు మంత్రి పొన్నం విజ్ఞప్తి

2




# దేశ రాజకీయంలో పెను మార్పు

నియోజకవర్గాల పునర్విభజన దిశగా కేంద్రం అడుగులు

131వ రాజ్యాంగ సవరణకు సిద్ధం

పార్లమెంటులో పెరగనున్న ప్రజా ప్రాతినిధ్యం

850కి పెరగనున్న లోక్‌సభ స్థానాలు





**న్యూ ఢిల్లీ, ఏప్రిల్ 14 (తీన్మార్ న్యూస్):** దేశ రాజకీయ ముఖచిత్రాన్ని మార్చే దిశగా కేంద్ర ప్రభుత్వం కీలక అడుగులు వేస్తోంది. దేశవ్యాప్తంగా నియోజకవర్గాల పునర్విభజన ప్రక్రియపై కేంద్రం తాజాగా సంచలన ప్రతిపాదనలు సిద్ధం చేసింది. ప్రస్తుతం ఉన్న లోక్‌సభ స్థానాల సంఖ్యను భారీగా పెంచి, 850కి చేర్చాలని ప్రభుత్వం భావిస్తోంది. రాష్ట్రాలకు 815 స్థానాలు, కేంద్రపాలిత ప్రాంతాలకు 35 స్థానాలు పెంచాలని నిర్ణయించింది. ఈ భారీ మార్పును అమలు చేయడం కోసం 131వ రాజ్యాంగ సవరణ బిల్లును తీసుకురావాలని కేంద్రం ప్రతిపాదించింది. ఈ మేరకు బిల్లుకు సంబంధించిన ప్రాథమిక సమాచారాన్ని ఇప్పటికే - మిగతా 2లో

## డీలిమిటేషన్ చేస్తే దక్షిణాదికి తీవ్ర అన్యాయం

- ఒక్క చప్రాసీ నౌకరీ కూడా రాదు
- డీలిమిటేషన్‌పై సీఎం వ్యాఖ్యలకు కిషన్ రెడ్డి కౌంటర్
- ముఖ్యమంత్రికి అవగాహన లేదు
- నియోజకవర్గాల పునర్విభజనపై కేంద్ర మంత్రి ఫైర్



**హైదరాబాద్, ఏప్రిల్ 14 (తీన్మార్ న్యూస్):** ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వారానికోసారి ఢిల్లీకి ఎందుకు వెళ్తున్నాడో రాష్ట్ర ప్రజలకు సమాధానం చెప్పాలని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి డిమాండ్ చేశారు. నియోజకవర్గ పునర్విభజనపై కేంద్రం ప్రభుత్వ ప్రతిపాదనలను వ్యతిరేకించిన సీఎం రేవంత్‌రెడ్డి, ఒకవేళ డీలిమిటేషన్ చేస్తే దక్షిణాదికి తీవ్ర - మిగతా 2లో

## హైడ్రాపై ఫేక్ నోటీసుల కలకలం

- సీఎం, రంగనాథ్‌లకు హైకోర్టు సమన్లు.. తప్పుడు ప్రచారం
- సీరియస్ అయిన హైడ్రా కమిషనర్
- సైబర్ క్రైమ్ పోలీసులకు కమిషనర్ రంగనాథ్ ఫిర్యాదు



## తెలంగాణలో భానుడి భగభగ



- జాగ్రత్త.. మధ్యాహ్నం బయటకు రావద్దు
- పలు జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ జారీ
- 42 డిగ్రీలు దాటిన ఉష్ణోగ్రతలు
- ప్రజలకు వాతావరణ శాఖ హెచ్చరిక

**తెలంగాణ బ్యూరో, ఏప్రిల్ 14 (తీన్మార్ న్యూస్)** తెలంగాణ రాష్ట్రంలో ఎండలు మండుతున్నాయి. ఉదయం 9 గంటల నుంచే భానుడు భగభగమంటున్నాడు. దాంతో జనం ఇళ్ల నుంచి బయటకు రావాలంటే జంకుతున్నారు. రాష్ట్రంలో వివిధ చోట్ల 42 డిగ్రీలకుపైగా ఉష్ణోగ్రతలు నమోద వుతున్నాయి. ఎండలు మండుతుండటంతో ఇవాళ ఉమ్మడి ఆదిలాబాద్, మహబూబ్‌నగర్‌తోపాటు నిజామాబాద్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, హైదరాబాద్ జిల్లాలకు వాతావరణశాఖ ఆరెంజ్ అలర్ట్ జారీచేసింది. మంగళవారం ఆదిలాబాద్, నిర్మల్, నిజామాబాద్ జిల్లాల్లో.. బుధవారం ఉమ్మడి ఆదిలాబాద్‌తో పాటు నిజామాబాద్, ఖమ్మం జిల్లాల్లో వడగాల్పులు వీచే - మిగతా 2లో

## కల్తీ ఆహారంపై సీపీ సజ్జనార్ సమరం

- ఈట్ రైట్ – బీ హెల్తీ వీడియో విడుదల
- కల్తీ ఆహార ముఠాల ఆటకట్టిస్తాం
- ప్రజలు అప్రమత్తంగా ఉండాలి: సీపీ సజ్జనార్





- అమీర్‌పేట్‌లో వైభవంగా ఖాల్సా పంథ్ స్థాపనోత్సవం
- హైదరాబాద్‌లో వెల్లివిరిసిన ఆధ్యాత్మికత
- సిక్కుల భారీ విశాల్ దీవాన్

## భక్తిశ్రద్ధలతో వైశాఖి వేడుకలు


**హైదరాబాద్, ఏప్రిల్ 14 (తీన్మార్ న్యూస్):** ఖాల్సా పంథ్ స్థాపనకు గుర్తుగా జరుపుకునే "వైశాఖి" పండుగను తెలంగాణ సిక్కు సమాజం మంగళవారం భక్తి, శ్రద్ధలతో అత్యంత వైభవంగా నిర్వహించింది. అమీర్‌పేట్‌లోని గురుద్వారా సాహెబ్ ఆధ్వర్యంలో ఈ వేడుకలు ఘనంగా జరిగాయి. ముఖ్య కార్యక్రమాలను అమీర్‌పేట్‌లోని శ్రీ గురు గోబింద్ సింగ్ జీ క్రీడా మైదానంలో నిర్వహించారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి వందలాది మంది సిక్కు భక్తులు, ఇతర మతాల ప్రజలు "విశాల్ దీవాన్" (మహా సభ)లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రముఖ రాగీ జథాలు, కథాకారులు గురుబాణీ - మిగతా 2లో



## అంబేద్కర్ ఆలోచనా విధానమే ప్రజాపాలన

- నియోజకవర్గాల విభజనపై బీజేపీ కుట్ర
- బగ్గుమన్న సీఎం రేవంత్ రెడ్డి

**హైదరాబాద్, ఏప్రిల్ 14 (తీన్మార్ న్యూస్):** రక్తం చిందకుండా యుద్ధాన్ని గెలవచ్చని మహాత్మాగాంధీ నిరూపిస్తే, ఆ గొప్ప దేశాన్ని అద్భుతంగా పరిపాలించి ప్రపంచ దేశాలకే ఆదర్శంగా నిలుపొచ్చవచ్చని నిరూపించింది డా.బిఆర్ అంబేద్కర్ అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. దళితులు, గిరిజనులు, ఆదివాసీలు, బలహీన వర్గాలు, మైనారిటీలు, మహిళలకు సమాన అవకాశాలు ఇవ్వడం ద్వారా ఈ దేశాన్ని అభివృద్ధి వైపు నడపవచ్చని చెప్పిన మార్గదర్శి, ప్రపంచ మేధావి అంబేద్కర్ అన్నారు. ఈ దేశానికి రెండు కళ్లలో ఒకటి మహాత్మగాంధీ అయితే మరో కన్ను డా.బిఆర్ అంబేద్కర్ అన్నారు. రాజ్యాంగ నిర్మాత డా.బిఆర్ అంబేద్కర్ జయంతి - మిగతా 2లో



## దేశంలోనే తొలి నాన్-ఏసీ క్లోజ్డ్ డోర్ రైలు

- సామాన్యుల భద్రత కోసం రైల్వే సరికొత్త ప్రయోగం
- సాధారణ చార్జీలకే ఏసీ రైలు స్థాయి భద్రత
- త్వరలో పట్టాలెక్కనున్న క్లోజ్డ్ డోర్ లోకల్ ట్రైన్

# అంబేద్కర్ ఆలోచనా విధానమే ప్రజాపాలన

-మొదటిపేజీ తరువాయి

సందర్భంగా మంగళవారం ట్యాంక్ బండ్ వద్ద అంబేద్కర్ విగ్రహానికి మంత్రులతో కలిసి సీఎం పూలమాల వేసి నివాళి అర్పించారు. అనంతరం అక్కడ ప్రభుత్వ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో మాట్లాడారు.

**అంబేద్కర్ వల్లే తెలంగాణ ఏర్పాటు:**

విద్య ఒక్కటే అన్ని సమస్యలకు పరిష్కారం చూపుతుందని, ఈ విద్య ద్వారానే సమాజంలో సముచిత స్థానం, గౌరవం ఇస్తుందని సంపూర్ణంగా నమ్మారన్నారు. ప్రపంచ దేశాలలోని పేరెన్నిక గల యూనివర్సిటీల్లో చదివి వచ్చిన అంబేద్కర్ ఆలోచన విధానమే ఇవాళ భారతదేశం ఆలోచన అన్నారు. అంబేద్కర్ ఆలోచన విధానమే ప్రజాపాలన విధానం అని, తెలంగాణ రాష్ట్రం రావడానికి ప్రధాన కారణం అంబేద్కర్ రాజ్యాంగంలో పెట్టిన ఆర్టికల్ 3 అని చెప్పారు. తెలంగాణ ఉద్యమంలో బడుగు బలహీన వర్గాల పిల్లలే ముందుండి ప్రత్యేక పాత్ర పోషించారు. అంబేద్కర్ తో పాటు ఇవాళ గద్దర్ ను గుర్తు చేసుకోవాలన్నారు. గద్దర్ తన కాలికి గజ్జె కట్టి గొంగడి భుజాన వేసి తెలంగాణ పల్లెల్లో ఉద్యమాన్ని ఉవ్వెత్తున ఎగిసేలా చేశారు. ఈ చరిత్రను సమాజం మరిచిపోతుందని ఎవరైనా అనుకుంటే అది వారి భ్రమే అవుతుందన్నారు. అందెశ్రీ రచించిన జయ జయహే తెలంగాణ గీతం ఈ నినాదం రణనినాదమై తెలంగాణ పల్లెల్లో మార్మోగి రాష్ట్రాన్ని సాధించుకునేలా చేసిందని ఈ గీతమే ఇప్పుడు రాష్ట్ర గీతంగా అవతరించిందన్నారు.

**గత ప్రభుత్వంలో దళితులంటే ఓర్వలేదు:**

తెలంగాణ వచ్చిన మొదటి పదేళ్లలో ఉద్యమంలో ముందున్న వారి పరిస్థితి ఎలా ఉంది? గద్దర్, అందెశ్రీ లాంటి వారి పరిస్థితి ఎలా ఉందని ఆలోచించాలన్నారు. గత పాలకులు ఎన్నికల్లో ఏదేదో హామీలు ఇచ్చారు. కానీ మంత్రివర్గంలో దళితులు, గిరిజనులకు వారిచ్చిన ఇచ్చిన స్థానం ఏంటో ఒక్కసారి ఆలోచన చేయాలన్నారు. ఆనాడు మంత్రి వర్గంలో ఏ జాతికి ఎంత స్థానం ఉంది? ఈనాడు మంత్రి వర్గంలో ఎంత స్థానం ఉందో మీరే లెక్క చెప్పాలన్నారు. ఒక స్పీకర్?తో పాటు నలుగురు మంత్రులు, విప్?లలో దళితులు, గిరిజనులకు ఇంతటి ప్రాతినిధ్యం ఉమ్మడి రాష్ట్రంలోనైనా దక్కలేదన్నారు. భట్టి విక్రమార్క సీఎల్పీ లీడర్?గా ఉంటే ఓర్వలేక అవమానకర రీతిలో అతడిని తొలగించిన చరిత్ర మన కళ్లముందే ఉందన్నారు. దళిత బిడ్డ బడ్జెట్ ప్రవేశపెడితే అవమానకరంగా మాట్లాడుతున్నారు. ఒక దళిత బిడ్డ ఆర్థిక మంత్రిగా, వైద్యఆరోగ్యశాఖ మంత్రిగా, విద్యుత్ శాఖ మంత్రిగా ఉండకూడదా? ఒక దళిత బిడ్డను అధ్యక్ష అని పిలవాల్సి వస్తుందని కొంత మంది అసెంబ్లీకే రావడం లేదంటే దళితుల పట్ల గౌరవం ఏపాటిదో ఓ సారి ఆలోచన చేయాలన్నారు. అందువల్ల వారి చేత మోసం, అవమానానికి గురైందో అదే జాతి బిడ్డను అధ్యక్ష నాకు మైక్ ఇవ్వమని అడిగే పరిస్థితి ప్రజా ప్రభుత్వం కల్పించిందన్నారు. 110 ఏళ్ల చరిత్ర కలిగిన ఉస్మానియా యూనివర్సిటీ, అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ వైస్ చాన్స్ లర్ గా దళితులకు అవకాశం ఇచ్చామన్నారు.

**వారిని గోతిలో పెట్టే బాధ్యత మీదే:**

దళితులు, గిరిజనులు, బడుగు బలహీన వర్గాల ప్రజలే ఈ దేశం భారతం భవిష్యత్?, సంపద అని ప్రజా ప్రభుత్వం గుర్తించింది. అందుకే అన్ని రకాలుగా ప్రోత్సహించడానికే ప్రభుత్వ పరంగా అన్ని రకాలుగా ప్రయత్నాలు చేస్తున్నామన్నారు. ఈ ప్రయత్నాల వల్లే గత పదేళ్ల పాలన, ఈ రెండేళ్ల మా పాలన చూసి ఉప ఎన్నికలు, పంచాయతీ, మున్సిపల్ ఎన్నికల్లో ప్రజలుమాకు పట్టం కడుతుంటే చూసి ఓర్వలేక కుట్రలు, తప్పుడు ప్రచారాలు చేస్తున్నారని ధ్వజమెత్తారు. మేము ఇందిరమ్మ ఇండ్లలో మెజారిటీ వాటా దళితులు, గిరిజనులకు ఉందనేది నిజం కాదా? మేము వచ్చాక 67 వేలకు పైగా ఇచ్చిన ప్రభుత్వ ఉద్యోగాల్లో 87 శాతం ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనారిటీ బిడ్డలకే ఉద్యోగాలు దక్కాయన్నారు. గతంలో జరిగిన అప్పులు, తప్పులను సరిదిద్దుకుంటూ మేము ముందుకు వెళ్తుంటే కొంత మంది వెనకాల నుంచి కుట్రలు చేస్తూ గోతులు తవ్వుతున్నారు. అలాంటి వారిని అదే గోతిలో పాతిపెట్టే బాధ్యత మీరు తీసుకోండి. ముందు వైపు నేను చూసుకుంటా. వెనకాల గోతులు తవ్వే వారిని, నక్కజిత్తులోలను, నల్లికుట్లోలను మీరే ఏదో ఒకటి చేయాలన్నారు. లేదంటే మంచి లక్ష్యంతో పని చేస్తుంటే నష్టం జరుగుతుందన్నారు. గత పాలకులు అంబేద్కర్ కు జయంతి, వర్ధంతికి ఎన్నిసార్లు నివాళి అర్పించారో అర్థం చేసుకోవాలన్నారు.

**బీజేపీ కుట్రలు:**

నియోజకవర్గాల పునర్విభజన విషయంలో బీజేపీ కుట్రలు చేస్తోందని సీఎం ధ్వజమెత్తారు. దక్షిణాది రాష్ట్రాలకు అన్యాయం చేసే కుట్ర చేస్తున్నారని 50 శాతం ప్రాతిపదికన పెంచుతామని దక్షిణాది రాష్ట్రాల సీట్ల కోటా తగ్గించాలని చూస్తున్నారన్నారు. దక్షిణాది రాష్ట్రాలలో మహిళలు, ఎస్సీ, ఎస్టీలకు అన్యాయం జరుగుతుందని ఈ చిన్న లెక్క కేంద్ర మంత్రులుగా ఉన్నవాళ్ళకి తెలియడం లేదా? అని ప్రశ్నించారు. రాజ్యాధికారం అంతిమ లక్ష్యం అని అంబేద్కర్ చెప్పారని దక్షిణాది రాష్ట్రాల్లో ప్రో రేటా ప్రకారం సీట్ల పెంపు కోసం మనం పోరాటం చేయాల్సిన అవసరం ఉందన్నారు. మంచి పనికి మా ప్రభుత్వం ముందుంటుందని ఈ ప్రభుత్వం మీది.. ఈ ప్రభుత్వాన్ని కాపాడుకునే బాధ్యత మీదన్నారు.

# సమ్మె నిర్ణయం సరైంది కాదు

హైదరాబాద్, ఏప్రిల్ 14 (తీన్మార్ న్యూస్): ఆర్టీసీ సంస్థను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని, ప్రస్తుత పరిస్థితుల్లో సమ్మె నిర్ణయం సరైంది కాదని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. ఈ మేరకు మంగళవారం ఆయన కీలక ప్రకటన విడుదల చేశారు. ఆర్టీసీ కార్మికుల సమస్యలను సామరస్యపూర్వకంగా పరిష్కరించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని మంత్రి పొన్నం స్పష్టం చేశారు. ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేసే అంశంపై గత ప్రభుత్వం హడావిడిగా నిర్ణయం తీసుకుందని మంత్రి విమర్శించారు. ప్రస్తుతం ఈ అంశంపై ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి నేతృత్వంలోని ఉన్నత స్థాయి కమిటీ అధ్యయనం చేస్తోందని, సంస్థ ఆర్థిక స్థితిగతులను బట్టి కమిటీ నివేదిక ఇస్తుందని తెలిపారు. విలీనం, కార్మిక సంఘాల గుర్తింపు మినహా మిగిలిన అన్ని సమస్యలపై చర్చించడానికి తమ ప్రభుత్వం సిద్ధంగా ఉందని, తన తలుపులు ఎల్లప్పుడూ తెరిచే ఉంటాయని ఆయన హామీ ఇచ్చారు. సంస్థ బలోపేతానికి చర్యలు గతంలో ఉన్న రూ.1205 కోట్ల పీఎఫ్ బకాయిలను రూ.600 కోట్లకు, రూ.690 కోట్ల సీసీఎస్ బకాయిలను రూ.300 కోట్లకు తగ్గించామని మంత్రి ప్రభాకర్ తెలిపారు. ఇప్పటికే 2978 కొత్త బస్సులను ప్రవేశపెట్టామని, 1134 మందికి కారుణ్య నియామకాలు చేపట్టామని పేర్కొన్నారు. కొత్త ఉద్యోగ నియామకాల ప్రక్రియ కూడా చివరి దశలో ఉందన్నారు. ఉచిత బస్సు ప్రయాణం వల్ల ఆర్టీసీ ఉనికి ప్రశ్నార్థకం కాలేదని, పైగా 90కి పైగా డిపోలు ఇప్పుడు లాభాల్లో నడుస్తున్నాయని వెల్లడించారు. ఇటీవలే 2.1 శాతం డీఏ అమలు చేశామని, పీఆర్సీ అంశం కూడా పరిశీలనలో ఉందని మంత్రి వెల్లడించారు. ఆర్టీసీ సంస్థ పరిరక్షణ, ఉద్యోగుల సంక్షేమం, ప్రయాణికుల సౌలభ్యం అనే మూడు సూత్రాలతో తమ ప్రభుత్వం పని చేస్తోందని, కార్మికులు ప్రజల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని సమ్మె ఆలోచన విరమించుకోవాలని పొన్నం ప్రభాకర్ విజ్ఞప్తి చేశారు.



# కాంగ్రెస్ డిక్లరేషన్లపై నిలదీస్తాం

కాంగ్రెస్ సర్కార్‌పై పోరాటానికి బీఆర్ఎస్ రెడీ

మే నెల నుంచే యుద్ధం ప్రకటించిన కేటీఆర్

అంబేద్కర్ జయంతి సాక్షిగా కేటీఆర్ సంచలన వ్యాఖ్యలు

**హైదరాబాద్, ఏప్రిల్ 14 (తీన్మార్ న్యూస్):** తెలంగాణలో రాజకీయాలు ఆసక్తిగా మారుతున్నాయి. రాబోయే అసెంబ్లీ ఎన్నికల కోసం ప్రధాన పార్టీలు ఇప్పటి నుంచే ఎత్తులకు?పై ఎత్తులు వేస్తున్నాయి. ఈ నేపథ్యంలో వచ్చే అసెంబ్లీ ఎన్నికలే లక్ష్యంగా రాబోయే రెండేళ్లకు బీఆర్ఎస్ పార్టీ కార్యాచరణపై ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కీలక వ్యాఖ్యలు చేశారు. మంగళవారం తెలంగాణ భవన్?లో జరిగిన అంబేద్కర్ జయంతి వేడుకల్లో కేటీఆర్ పాల్గొన్నారు. అంబేద్కర్ చిత్రపటానికి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఏప్రిల్ 20న జగిత్యాలలో జరిగే బహిరంగ సభకు కేసీఆర్ హాజరు కాబోతున్నారని ఏప్రిల్ 27న పార్టీ ఆవిర్భావ దినోత్సవం ఈ రెండు కార్యక్రమాలు అయ్యాక మే, జూన్ నెల నుంచి కాంగ్రెస్ ప్రభుత్వంపై పోరాటాలను ట్రాక్ ఎక్కించబోతున్నట్లు వెల్లడించారు. తొలుత ఎస్సీ, ఎస్టీలతోనే మొదలు పెట్టబోతున్నట్లు స్పష్టం చేశారు. కాంగ్రెస్ నాయకులు డిక్లరేషన్లు ప్రకటించి ప్రజలను మోసం చేసిందని ఈ విషయాన్ని గుర్తు చేసేలా ఏయే ప్రాంతాల్లో డిక్లరేషన్లు ప్రకటించారో అదే ప్రాంతంలో ఆ డిక్లరేషన్లను గుర్తు చేస్తూ సభలు పెట్టబోతున్నట్లు వెల్లడించారు.



**అంబేద్కర్ ను కాంగ్రెస్ రాజకీయాలకు వాడుకుంది:**

అంబేద్కర్ బాటలో తెలంగాణ సాధించామని కేటీఆర్ అన్నారు. కాంగ్రెస్ పార్టీ అంబేద్కర్ ను తన రాజకీయాల కోసం వాడుకుందని, రెండు సార్లు పార్లమెంట్ కు రాకుండా అడ్డుకున్నారని ఆరోపించారు. అంబేద్కర్ కు భారతరత్న ఇవ్వలేదని కనీసం పార్లమెంట్ లో ఆయన ఫోటో కూడా పెట్టలేదన్నారు. 125 అడుగుల విగ్రహాన్ని సంకెళ్లతో బంధిస్తే మేము ఆరోజు వార్నింగ్ ఇస్తే ఈరోజు అంబేద్కర్ విగ్రహం దగ్గర గేట్లు తెరుచుకున్నాయన్నారు. కాంగ్రెస్ ది అరాచక, మూర్ఖపు ప్రభుత్వం అని ఎస్సీ, ఎస్టీలను కాంగ్రెస్ మోసం చేసిందన్నారు. వెయ్యి గురుకులాల్లో మరణ మృదంగం మోగుతోందన్నారు.

## తమిళ ఎన్నికలకు ధురంధర్ లింక్

చెన్నై

ఐదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలకు కేంద్ర ఎన్నికల సంఘం నోటీఫికేషన్ ఇచ్చింది. ఇందులో మూడు రాష్ట్రాలు కేరళ, పాండిచ్చేరి, అస్సాం రాష్ట్రల ఎన్నికలు ముగిశాయి. తమిళనాడు, పశ్చిమబెంగాల్ ఎన్నికలు జరుగనున్నాయి. ఈ రెండు రాష్ట్రాలు చాలా కీలకంగా మారాయి. బెంగాల్‌లో పాగా వేసేందుకు బీజేపీ ప్రయత్నిస్తోంది. ఇక తమిళనలడులో అన్నాడీఎంకేతో కలిసి పోటీ చేస్తోంది. ఇక్కడ నామినేషన్లు పూర్తయ్యాక అన్ని పార్టీలు ప్రచారంపై దృష్టి పెట్టాయి. డీఎంకే, ఏఐఏడీఎంకే లాంటి ద్రవిడ పార్టీలు ఓటర్లను ఆకర్షించేందుకు వ్యూహాలు రూపొందిస్తుంటే, హిందీ సినిమా 'దురంధర్' ద్రవిడవాద పార్టీను భయపెడుతోంది.దురంధర్ సినిమా అంటే పాకిస్తాన్ భయపడాలి. ఇందులో భారత దేశభక్తి, పాకిస్తాన్‌లో మన ఏజెంట్లు చేస్తున్న ఆపరేషన్లతో ఇప్పటికే పాకిస్తాన్ హడలెత్తిపోతోంది. సినిమాను నిషేధించింది. తమిళనాడులోని ద్రవిడవాద పార్టీలు సినిమా విడుదలను ఆపమని కోర్టుల్లో పిటిషన్లు వేశాయి. డిజిటల్ ప్లాట్‌ఫామ్‌లలో కూడా రిలీజ్ చేయవద్దని డిమాండ్ చేశాయి. ఎన్నికలయ్యే వరకు ఆపాలని వాదించాయి, ఎందుకంటే సినిమా బీజేపీకి అనుకూల ఓట్లు తెచ్చి, మిత్రపక్షాలకు లాభం చేస్తుందని భావిస్తున్నాయి.సెంట్రల్ బోర్డు ఆఫ్ ఫిల్మ్ సర్టిఫికేషన్ సినిమాకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. కోర్టు పిటిషనర్ల పార్టీ ప్రయోజనాలు ప్రభావితం చేసే సీన్లు న్యాయస్థానానికి చూపించలేకపోయాయి. సినిమాలో భారత గొప్పతనం, పాకిస్తాన్ రహస్య కార్యకలాపాలు మాత్రమే ఉన్నాయని, ఎన్నికలపై ప్రభావం లేదని కోర్టు తీర్పు ఇచ్చింది. సాక్ష్యాలు లేకుండా విడుదల ఆపడం అన్యాయమని న్యాయస్థానం పేర్కొంది.దేశభక్తి అంశాలు బీజేపీకి మాత్రమే లాభమని ద్రవిడ, విపక్ష పార్టీలు భావిస్తున్నాయి. దురంధర్ పాకిస్తాన్‌ను భయపెట్టాలని, తమిళనాడులో ద్రవిడ పార్టీలను కూడా భయపెట్టుతుందని వాదన. హిందీ సినిమా తమిళ ప్రేక్షకులను ప్రభావితం చేసి, ఓటింగ్ పద్ధతులను మార్చవచ్చని ఆందోళన. హిందీ అంటే తమకు నచ్చదని చెప్పే ద్రవిడ పార్టీలు హిందీ వర్షన్ కూడా విడుదల కావొద్దని భావించాయి.కోర్టు తీర్పు వ్యక్తి స్వేచ్ఛ, మీడియా హక్కులకు బలం. ద్రవిడ పార్టీలు ఈ వివాదాన్ని ప్రచారంలో ఉపయోగించుకుని, 'హిందీ ఆధిపత్యం' వాదన

## దేశ రాజకీయంలో పెను మార్పు

-మొదటిపేజీ తరువాయి

ఎంపీలకు చేరవేసినట్లు తెలుస్తోంది. పెరిగిన జనాభాకు అనుగుణంగా ప్రాతినిధ్యాన్ని కల్పించడమే లక్ష్యంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. నియోజకవర్గాల పునర్విభజన ద్వారా పార్లమెంటులో ప్రజా ప్రాతినిధ్యం మరింత పెరగనుంది. ఉత్తరాది రాష్ట్రాలతో పోలిస్తే దక్షిణాది రాష్ట్రాలపై దీని ప్రభావం ఎలా ఉంటుందనే అంశంపై రాజకీయ వర్గాల్లో ఆసక్తి నెలకొంది. కొత్త పార్లమెంటు భవనంలో పెరగబోయే సభ్యుల సంఖ్యకు అనుగుణంగా ఇప్పటికే సీటింగ్ ఏర్పాట్లు పూర్తి చేసిన సంగతి తెలిసిందే. రాబోయే రోజుల్లో ఈ బిల్లు పార్లమెంటు ముందుకు వచ్చే అవకాశం ఉంది. అదే జరిగితే భారత ప్రజాస్వామ్య చరిత్రలో ఇది అతిపెద్ద సంస్కరణగా నిలిచిపోనుంది.

## డీలిమిటేషన్ చేస్తే దక్షిణాదికి తీవ్ర అన్యాయం

-మొదటిపేజీ తరువాయి

అన్యాయం జరుగుతుందని, ఒక్క చప్రాసీ నౌకరీ కూడా రాదని వ్యాఖ్యానించడంపై ఆయన స్పందించారు. డీలిమిటేషన్ వల్ల దక్షిణాది రాష్ట్రాలకు సీట్లు భారీగా తగ్గుతాయనే ప్రచారంలో వాస్తవం లేదని, తాము దక్షిణాదిలోనే ఉన్నామని అన్యాయం జరుగనివ్వమని స్పష్టంచేశారు. సీఎం రేవంత్‌రెడ్డికి అవగాహన లేదని ఎద్దేవా చేసిన కిషన్‌రెడ్డి, డీలిమిటేషన్ కాకుండా మహిళా రిజర్వేషన్లు చేయలేమని స్పష్టంచేశారు. డీలిమిటేషన్‌పై ముఖ్యమంత్రి వ్యాఖ్యలను ఆయన విజ్ఞతకే వదిలేస్తున్నానని చెప్పారు.

## తెలంగాణలో భానుడి భగభగ

-మొదటిపేజీ తరువాయి

అవకాశం ఉందని వాతావరణ కేంద్రం పేర్కొన్నది. గురువారం నుంచి ఎండలు మరింత తారెత్తించే అవకాశమున్నట్లు వాతావరణశాఖ తెలిపింది. ప్రజలు అత్యవసరమైతే తప్ప మధ్యాహ్నం 12 గంటల నుంచి సాయంత్రం 3 గంటలవరకు బయటకు రావద్దని సూచించింది.

## హైడ్రాపై ఫేక్ నోటీసుల కలకలం

హైదరాబాద్, ఏప్రిల్ 14 (తీన్మార్ న్యూస్):

హైకోర్టు నోటీసుల పేరుతో హైడ్రాపై తప్పుడు ప్రచారం జరుగుతోందని హైడ్రా కమిషనర్ రంగనాథ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. అదంతా ఫేక్ ప్రచారం అని తేల్చి చెప్పారు. ఏకంగా సీఎం రేవంత్ రెడ్డి, హైడ్రా కమిషనర్ రంగనాథ్ లకు హైకోర్టు సమన్లు అంటూ ఫేక్ నోటీస్ రావడంపై ఆయన తీవ్రంగా స్పందించారు. హైకోర్టు చీఫ్ జస్టిస్ పేరుతో సోషల్ మీడియాలో నోటీస్ వైరల్ కావడాన్ని రంగనాథ్ గుర్తించారు. తాజా కూల్చివేతల అంశంపై వ్యక్తిగతంగా సీఎం రేవంత్ రెడ్డి, హైడ్రా కమిషనర్ రంగనాథ్ లకు చీఫ్ జస్టిస్ బెంచ్ ముందు హాజరు కావాలంటూ వచ్చిన నోటీస్ ఫేక్ అని చెప్పారు. సోషల్ మీడియాలో ఫేక్ నోటీస్ సర్కులేట్ చేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. హైకోర్టు ఫేక్ నోటీస్ పై హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు హైడ్రా కమిషనర్ రంగనాథ్. కేసు నమోదు చేసుకున్న హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

## కల్తీ ఆహారంపై సీపీ సజ్జనార్ సమరం

హైదరాబాద్, ఏప్రిల్ 14 (తీన్మార్ న్యూస్):

కల్తీ ఆహారం మూలంగా ప్రజల ఆయుష్షు తగ్గిపోవడమే కాకుండా రకరకాల కొత్త వ్యాధులు చుట్టుముడుతున్నాయని నగర పోలీస్ కమిషనర్ సజ్జనార్ అన్నారు. ఈ మేరకు మంగళవారం ఈట్ రైట్, బీ హెల్తీ పేరుతో నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్న సీపీ వీడియోను ఎక్స్ లో పోస్ట్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కల్తీ లేని ఆరోగ్యం దిశగా మా పోరాటం కొనసాగుతుందన్నారు. ఆరోగ్య హైదరాబాద్, సురక్షిత హైదరాబాద్ అనేదే తమ నినాదమని పేర్కొన్నారు. తక్కువ సమయంలోనే కల్తీ ఆహార ముఠాల ఆటకట్టిస్తూ ప్రజారోగ్యం కోసం అంకితభావంతో పని చేస్తున్న అధికారులందరినీ అభినందించారు. ప్రజలు తాము ఏం తింటున్నారో, అది ఎక్కడి నుంచి వస్తుందో అనే అంశాలపై అవగాహన పెంచుకోవాలని సీపీ సజ్జనార్ సూచించారు.

## భక్తిశ్రద్ధలతో వైశాఖి వేడుకలు

-మొదటిపేజీ తరువాయి

కీర్తనలు, ధార్మిక ఉపన్యాసాలు ఇచ్చారు.

వారు గురు గ్రంథ్ సాహిబ్ బోధనలు, ఖాల్సా పంథ్ స్థాపన విశిష్టత, జీవన విలువల ప్రాముఖ్యతపై వివరించారు. జాతీయ ఐక్యత, సౌభ్రాతృత్వం, సామరస్యాన్ని పాటించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో భాయ్ ఎస్.గురుదేవ్ సింగ్ (ఆస్ట్రేలియా), జ్ఞాని గగన్‌దీప్ సింగ్ జీ (పట్నా సాహిబ్), భాయ్ ఎస్. మన్‌ప్రీత్ సింగ్ జీ (ఢిల్లీ), భాయ్ వీర్ సింగ్ (హైదరాబాద్) తదితర ప్రముఖులు గురుబాణీ కీర్తనలు, కథలు వినిపించారు. గురుద్వారా సాహెబ్ అమీర్‌పేట్ నిర్వహణ కమిటీ అధ్యక్షుడు ఎస్.దర్శన్ సింగ్, ప్రధాన కార్యదర్శి ఎస్. సురేందర్ సింగ్ రాష్ట్రం నలుమూలల నుంచి వచ్చిన భక్తులను ఆహ్వానించారు. కార్యక్రమం అనంతరం భక్తులందరికీ సంప్రదాయ "గురు కా లంగర్" (ఉచిత భోజనం) వడ్డించారు. రంగురంగుల నగర్ కీర్తన్ నిర్వహణ సాయంత్రం గురుద్వారా సాహెబ్ అమీర్‌పేట్ నుంచి భారీగా నగర్ కీర్తన్ (పవిత్ర ఊరేగింపు) ఉంటుంది. ఈ ఊరేగింపు గ్రీన్‌లాండ్స్, బేగంపేట్, పంజాగుట్ట ప్రధాన మార్గాల మీదుగా తిరిగి గురుద్వారాకు చేరుకుంటుంది. ఈ సందర్భంగా శ్రీ గురు గ్రంథ్ సాహిబ్‌ను అలంకరించిన వాహనంలో ప్రతిష్ఠాత్మకంగా తీసుకెళ్తారు. నిశాన్ సాహిబ్ పతాకదారులు ముందుండగా, యువత గట్కా (సిక్కు యోధ కళ) ప్రదర్శనలు అందరినీ ఆకట్టుకుంటాయి. కీర్తన బృందాలు శబ్ద కీర్తనలు ఆలపిస్తారు.

## దేశంలోనే తొలి నాన్-ఏసీ క్లోజ్డ్ డోర్ రైలు

న్యూ ఢిల్లీ, ఏప్రిల్ 14 (తీన్మార్ న్యూస్):



రద్దీ కారణంగా రైలు నుంచి కింద పడి ప్రయాణికులు ప్రాణాలు కోల్పోతున్న ఘటనలను అరికట్టడానికి, దేశంలోనే మొట్టమొదటిసారిగా 'నాన్-ఏసీ క్లోజ్డ్ డోర్' లోకల్ రైలును ముంబైలో భారతీయ రైల్వే అందుబాటులోకి తీసుకురానుంది. ప్రస్తుతం ఆ ట్రైన్‌కు సంబంధించి అధికారులు ట్రయల్ రన్ నిర్వహించారు. ఇటీవల ముంబ్రా సమీపంలో ఫుట్‌బోర్డ్‌పై ప్రయాణిస్తూ కింద పడి ప్రయాణికులు మృతి చెందిన ఘటన దేశవ్యాప్తంగా చర్చనీయాంశమైంది. సాధారణంగా ఆటోమేటిక్ తలుపులు కేవలం ఖరీదైన ఏసీ రైళ్లలో మాత్రమే ఉంటాయి. కానీ, సామాన్య ప్రయాణికులకు కూడా అదే స్థాయి భద్రత కల్పించాలనే ఉద్దేశంతో ఈ కొత్త ప్రయోగానికి శ్రీకారం చుట్టారు.

**కొత్త రైలు ప్రత్యేకతలు**

రైలు కదిలే ముందు తలుపులు వాటంతట అవే మూసుకుంటాయి. దీంతో ప్రయాణికులు గేట్ల వద్ద వేలాడే అవకాశం ఉండదు. తలుపులు మూసి ఉన్నప్పుడు గాలి సరిగ్గా అందేలా ఈ నాన్-ఏసీ బోగీల్లో ప్రత్యేకంగా ఎయిర్ సర్క్యులేషన్ సిస్టమ్, ఫోర్స్డ్ వెంటిలేషన్ ఫ్యాన్లను ఏర్పాటు చేశారు. చెన్నైలోని ఇంటిగ్రల్ కోచ్ ఫ్యాక్టరీలో ఈ రైలు తయారైంది. ఏసీ రైలు టికెట్ ధరలు సామాన్యులకు భారంగా ఉన్నందున, సాధారణ నాన్-ఏసీ ఛార్జీలకే ఈ క్లోజ్డ్ డోర్ ప్రయాణం అందుబాటులోకి రానుంది. తాజాగా నిర్ణయం వల్ల ముంబై లోకల్ రైళ్లలో ప్రతిరోజూ జరిగే ప్రమాదాలు గణనీయంగా తగ్గుతాయని రైల్వే అధికారులు ఆశిస్తున్నారు. ప్రయోగాత్మక పరీక్షల అనంతరం ఈ రైలును సెంట్రల్ లేదా వెస్ట్రన్ లైన్లలో అందుబాటులోకి తీసుకురానున్నారు.

# డిగ్రీ ప్రవేశాలకు 'దోస్త్' నోటిఫికేషన్ విడుదల

**నేటి నుంచే ఆన్‌లైన్ దరఖాస్తులు ప్రారంభం**
**అడ్మిషన్ల షెడ్యూల్ ఖరారు**
**మూడు విడతల్లో ప్రవేశాల ప్రక్రియ**

హైదరాబాద్, ఏప్రిల్ 14 (తీన్మార్ న్యూస్): రాష్ట్రంలోని సర్కారు, ప్రైవేటు డిగ్రీ కాలేజీల్లో అడ్మిషన్లకు సంబంధించి డిగ్రీ ఆన్‌లైన్ సర్వీసెస్ తెలంగాణ (దోస్త్) నోటిఫికేషన్ విడుదలైంది. ఈ సారి మూడు విడతల్లో ప్రవేశాల ప్రక్రియ చేపడతామని తెలంగాణ హయ్యర్ ఎడ్యుకేషన్ కౌన్సిల్ (టీజీసీహెచ్‌ఈ) ప్రకటించింది. సోమవారం హైదరాబాద్ లో టీజీసీహెచ్?ఈ వైస్ చైర్మన్లు పురుషోత్తం, మహమూద్, సెక్రటరీ శ్రీరామ్ వెంకటేశ్, కళాశాల విద్యాశాఖ జాయింట్ డైరెక్టర్లు రాజేందర్ సింగ్, బాలభాస్కర్ తో కలిసి టీజీసీహెచ్‌ఈ చైర్మన్, దోస్త్ కన్వీనర్ ప్రొఫెసర్ వి బాలకిష్టారెడ్డి. దోస్త్ –2026 షెడ్యూల్‌ను ప్రకటించారు. డిగ్రీ ఫస్టియర్?లో ప్రవేశాల కోసం నేటి నుంచి ఆన్‌లైన్ దరఖాస్తులు ప్రారంభమవుతాయని ఆయన తెలిపారు. ఇంటర్ పాసైన విద్యార్థులు దోస్త్ వెబ్‌సైట్ (హ్ట్ట్ప్ష్://ద్శొస్త్.చ్గ్గ్.ట్గ్.గొవ్.ఇన్) ద్వారా తమకు నచ్చిన కోర్సుల్లో చేరవచ్చని సూచించారు. దోస్త్ ద్వారా స్టేట్ లోని ఉస్మానియా వర్సిటీతో పాటు కాకతీయ, తెలంగాణ, పాలమూరు, మహాత్మాగాంధీ, శాతవాహన, జేఎన్టీయూ, డాక్టర్ మన్మోహన్ సింగ్ ఎర్త్ సైన్సెస్ యూనివర్సిటీ, వీరనారి చాకలి ఐలమ్మ మహిళా వర్సిటీల్లో బీఏ, బీకాం, బీఎస్సీ, బీబీఏ, బీసీఏ, బీబీఎం తదితర కోర్సుల్లో అడ్మిషన్లు చేపట్టనున్నారు. స్టేట్ టెక్నికల్ ఎడ్యుకేషన్ బోర్డు ఆధ్వర్యంలోని పాలిటెక్నిక్ కాలేజీల్లో డీ– ఫార్మసీ కోర్సుల్లోనూ ప్రవేశాలు కల్పించనున్నారు. రాష్ట్రంలోని సర్కారు, ప్రైవేటు, ఎయిడెడ్ డిగ్రీ కాలేజీలు 909 ఉండగా, వాటిలో 4,01,521 సీట్లు అందుబాటులో ఉన్నాయి. దీనిలో 79 రెసిడెన్షియల్ డిగ్రీ కాలేజీలు ఉండగా, వాటిలో 23,654 సీట్లున్నాయి. అయితే, రెసిడెన్షియల్ కాలేజీల్లో ఆయా సొసైటీలే ప్రవేశాలు నిర్వహిస్తుంటాయి.

**మూడు ఫేజ్ లలో కౌన్సెలింగ్**

తొలి విడత రిజిస్ట్రేషన్లు ఈ నెల 15 నుంచి మే 7 వరకు కొనసాగుతాయి. రిజిస్ట్రేషన్ పూర్తయిన




విద్యార్థులు ఈ నెల 30 నుంచి మే 8 వరకు వెబ్ ఆప్షన్లు ఇచ్చుకోవాల్సి ఉంటుంది. మే 14న మొదటి విడత సీట్ల కేటాయింపు ఉంటుంది. రెండో విడత మే15 నుంచి 25 వరకు, మూడో విడత మే 31 నుంచి జూన్ 15 వరకు రిజిస్ట్రేషన్లకు అవకాశం కల్పించారు. మొదటి విడతలో రిజిస్ట్రేషన్ ఫీజు రూ. 200 కాగా, రెండు, మూడు విడతల్లో రూ. 400 చెల్లించాల్సి ఉంటుంది. మూడు విడతల్లో సీట్లు పొందిన విద్యార్థులు జూన్ 20 నుంచి 27 మధ్య ఆయా కాలేజీల్లో సెల్ఫ్ రిపోర్టింగ్ చేయాల్సి ఉంటుంది. జూన్ 29, 30 తేదీల్లో విద్యార్థులకు ఓరియంటేషన్ కార్యక్రమం నిర్వహిస్తారు. జులై 1వ తేదీ నుంచి మొదటి సెమిస్టర్ క్లాసులు ప్రారంభమవుతాయి.

దోస్త్ యాప్ ద్వారా రిజిస్ట్రేషన్లు

విద్యార్థులు ఎవరి సాయం లేకుండానే స్మార్ట్‌ఫోన్ ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకునేలా దోస్త్ యాప్‌ను టీజీసీహెచ్?ఈ అందుబాటులోకి తీసుకొచ్చింది. విద్యార్థులు ఆధార్ నంబర్ ద్వారా లేదా 'ఫేషియల్ రికగ్నిషన్' ద్వారా సులభంగా రిజిస్ట్రేషన్ పూర్తి చేయవచ్చు. విద్యార్థుల సందేహాల నివృత్తి కోసం 79010 02200 నంబర్ తో వాట్సాప్ చాట్‌బాట్ సౌకర్యాన్ని కల్పించారు. రాష్ట్రవ్యాప్తంగా 40 హెల్ప్‌లైన్ సెంటర్లను ఏర్పాటు చేసినట్టు బాలకిష్టారెడ్డి తెలిపారు. అలాగే, దోస్త్ హెల్ప్ డెస్క్ నంబర్ (040 23120416) ను సంప్రదించవచ్చని సూచించారు.

దోస్త్ షెడ్యూల్

**ఫస్ట్ ఫేజ్:**
ఏప్రిల్ 15 నుంచి మే 7 వరకు దరఖాస్తుల స్వీకరణ
ఏప్రిల్ 30 నుంచి మే 8 వరకు వెబ్ ఆప్షన్లు
మే 14న మట్నదటి ఫేజ్ సీట్ల కేటాయింపు
మే 23 వరకు ఆన్?లైన్? స్పెల్ఫ్? రిపోర్టింగ్

**సెకండ్ ఫేజ్:**
మే 15 నుంచి 25 వరకు దరఖాస్తులు
మే 15 నుంచి 26 వరకు వెబ్ ఆప్షన్లు
మే 30న రెండో ఫేజ్ సీట్ల కేటాయింపు
జూన్ 5 వరకు ఆన్?లైన్? స్పెల్ఫ్? రిపోర్టింగ్

**థర్డ్ ఫేజ్ :**
మే 31 నుంచి జూన్ 15 వరకు దరఖాస్తులు
మే 31 నుంచి జూన్16 వరకు వెబ్ ఆప్షన్లు
జూన్ 20న థర్డ్ ఫేజ్ సీట్ల కేటాయింపు
జూన్ 25 వరకు ఆన్?లైన్? స్పెల్ఫ్? రిపోర్టింగ్

# బిహార్ కొత్త ముఖ్యమంత్రిగా సమ్రాట్ చౌధరీ

బిహార్‌లో కొంతకాలంగా నెలకొన్న ఉత్కంఠకు తెరదించుతూ రాష్ట్ర కొత్త ముఖ్యమంత్రిగా సమ్రాట్ చౌధరీ పేరు ఖరారైంది. ప్రస్తుత ముఖ్యమంత్రి నీతీశ్ కుమార్ తన పదవికి రాజీనామా చేయడంతో, బీజేపీ తన బలాన్ని నిరూపించుకుంటూ రాష్ట్ర పగ్గాలను చేపట్టబోతోంది. శాసనసభాపక్ష సమావేశంలో, సమ్రాట్ చౌధరీ తమ నాయకుడిగా ఎమ్మెల్యేలు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. బుధవారం లోక్‌భవన్‌లో ఆయన సీఎంగా బాధ్యతలు చేపట్టనున్నట్లుగా సమాచారం. దీంతో బిహార్‌లో సమ్రాట్ శకం మొదలుకానుంది.

243 అసెంబ్లీ స్థానాలున్న బిహార్‌లో ఎన్‌డీఏకు 202 మంది సభ్యుల బలం ఉండగా, అందులో 89 మంది ఎమ్మెల్యేలతో బీజేపీ అతిపెద్ద పార్టీగా కొనసాగుతోంది. నీతీశ్ కుమార్ సీఎం పదవికి రాజీనామా చేసిన నేపథ్యంలో పట్నాలోని పార్టీ ప్రధాన కార్యాలయంలో బీజేపీ శాసనసభాపక్ష సమావేశం ఏర్పాటు చేసింది. అందులో సమ్రాట్ చౌధరీ పేరును శాసనసభా పక్ష నేతగా మరో డిప్యూటీ సీఎం విజయ్ సిన్హా ప్రతిపాదించారు. దీంతో ఎమ్మెల్యేలు అందరూ సమ్రాట్ చౌధరీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. శాసనసభ పక్ష సమావేశం అనంతరం సమ్రాట్ మీడియాతో మాట్లాడుతూ, ప్రజలకు సేవ చేయడానికే బీజేపీ తనకు ఈ అవకాశం ఇచ్చిందని తెలిపారు. సుమారు 30 ఏళ్లుగా రాజకీయ కార్యకర్తగా పని చేస్తున్నారని, కానీ ఇంతకుముందు తనకు ఎలాంటి సిద్ధాంతం లేదని, 2015 నుంచే బీజేపీ కోసం పనిచేస్తున్నాని గుర్తుచేశారు. నీతీశ్ కుమార్ నుంచి ఎన్నో విషయాలు నేర్చుకున్నట్లు చెప్పారు. ప్రభుత్వం ఎలా నడపాలి, బిహార్‌లో సుపరిపాలన ఎలా నెలకొల్పాలి, ప్రజాస్వామ్యానికి ఏది మంచిదనే అన్ని చెప్పారని పేర్కొన్నారు. ప్రధాని మోదీ వికసిత భారత్ దార్శనికత, నీతీశ్ కుమార్ సుసంపన్నమైన బిహార్‌ను ముందుకు తీసుకెళ్తామని అన్నారు.

**'బిహార్ ప్రజలకు సేవ చేసేందుకు ఓ అవకాశం'**



నూతన సీఎంగా ఎన్నికైన అనంతరం సమ్రాట్ చౌధరీ ఎక్స్‌లో పోస్ట్ చేస్తూ బీజేపీ నాయకత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. 'బీజేపీ నాయకుడిగా బాధ్యతను అప్పగించి, నాపై విశ్వాసం ఉంచినందుకు పార్టీ నాయకత్వానికి నా హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేస్తున్నా. ఇది నాకు కేవలం ఒక పదవి మాత్రమే కాదు. బిహార్ ప్రజలకు సేవ చేసేందుకు, వారి నమ్మకాన్ని, కలలను సాకారం చేసేందుకు లభించిన ఒక పవిత్రమైన అవకాశం. సంపూర్ణ అంకితభావం, నిబద్ధత చిత్తశుద్ధితో ప్రతి ఒక్కరి అంచనాలకు అనుగుణంగా నడుచుకుంటానని నేను ప్రతిజ్ఞ చేస్తున్నా. ప్రధాని మోదీ, నాయకత్వంలోనూ, పార్టీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్ గారి మార్గదర్శకత్వంలోనూ బిహార్‌ను అభివృద్ధి, సుపరిపాలన సంపన్నతలో కొత్త శిఖరాలకు చేర్చడానికి నేను నిరంతరం కట్టుబడి ఉంటాను. మీ ఆప్యాయత, ఆశీస్సులు, సహకారమే నా అత్యంత గొప్ప బలం' అని సమ్రాట్ చౌధరీ పోస్ట్‌లో రాసుకొచ్చారు.

**సమ్రాట్ రాజకీయ ప్రస్థానం**


బిహార్ రాజకీయాల్లో అత్యంత కీలక నేతగా ఎదిగిన నాయకుడు సమ్రాట్ చౌధరీ. కుష్వాహా సామాజికవర్గానికి చెందిన బలమైన నాయకుడిగా, బీజేపీకి ఓబీసీ ముఖచిత్రంగా ఆయన గుర్తింపు పొందారు. ఆయన తండ్రి శకుని చౌధరీ ఏడుసార్లు ఎమ్మెల్యే, ఎంపీగా పని చేశారు. తల్లి పార్వతీ దేవి తారాపూర్ నుంచి ఎమ్మెల్యేగా పనిచేశారు. 57 సంవత్సరాల సమ్రాట్ చౌధరీ సామాన్య కార్యకర్త నుంచి రాష్ట్ర ముఖ్యమంత్రి స్థాయికి ఎదిగిన తీరు ఆసక్తికరంగా ఉంటుంది. రెండుసార్లు ఎమ్మెల్సీగా గెలిచిన సమ్రాట్ చౌధరీ, అసెంబ్లీ ఎన్నికలకు మొత్తం ఐదు సార్లు పోటీ చేయగా మూడు సార్లు విజయం సాధించారు. ప్రస్తుతం తారాపూర్ నియోజకవర్గానికి బీజేపీ ఎమ్మెల్యేగా ప్రాతనిథ్యం వహిస్తున్నారు.

**మూడు ప్రధాన పార్టీల్లో కీలక బాధ్యతలు**

రాజకీయ జీవితంలో సమ్రాట్ చౌధరీ మూడు ప్రధాన పార్టీల్లో కీలక బాధ్యతలు నిర్వహించారు. లాలూప్రసాద్ యాదవ్?కు చెందిన ఆర్‌జేడీలో 1990లలో సమ్రాట్ రాజకీయ జీవితం ప్రారంభించారు. 1999లో రబ్రీ దేవి ప్రభుత్వంలో అతితక్కువ వయస్సులో వ్యవసాయ మంత్రిగా పనిచేశారు. అయితే వయస్సుకు సంబంధించి చెలరేగిన వివాదాల కారణంగా ఆయన రాజీనామా చేయాల్సి వచ్చింది. 2014లో జేడీయూలో చేరిన సమ్రాట్, ఆ పార్టీలో చీలిక తెచ్చి తిరుగుబాటు నేతగా నిలిచారు. తర్వాత 2018లో కాషాయ కండువా కప్పుకున్న ఆయన, బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా, 2023లో రాష్ట్ర అధ్యక్షుడిగా సైతం బాధ్యతలు నిర్వహించారు. 2021--22లో నీతీశ్ కుమార్ నేతృత్వంలోని ఎన్?డీయే ప్రభుత్వంలో ఉప ముఖ్యమంత్రిగా పనిచేశారు. 2025 ఎన్నికల తర్వాత మరోసారి ఉపముఖ్యమంత్రి బాధ్యతలు చేపట్టిన సమ్రాట్, హోంశాఖ వ్యవహారాలను సైతం చక్కబెట్టారు.

# ఆర్టికల్ 370 రద్దు తర్వాత పూర్తిగా అమల్లోకి రాజ్యాంగం

డాక్టర్ బీఆర్‌అంబేద్కర్ ఆశయాల మేరకు రాజ్యాంగ గౌరవాన్ని పునరుద్ధరించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పేర్కొన్నారు. ఆర్టికల్ 370 రద్దు తర్వాత దేశవ్యాప్తంగా రాజ్యాంగం పూర్తిగా అమల్లోకి వచ్చిందని తెలిపారు. ఉమ్మడి పౌరస్మృతిని అమలు చేసిన తొలి రాష్ట్రంగా ఉత్తరాఖండ్ నిలించిందని కొనియాడారు. మంగళవారం దిల్లీ–దెహ్రాదూన్ ఎకనామిక్ కారిడార్‌ను ప్రధాని మోదీ ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన బహిరంగ సభలో మాట్లాడుతూ ఈ మేరకు వ్యాఖ్యలు చేశారు. చట్టసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు అమల్లో జాప్యం జరగడానికి వీల్లేదని ప్రధాని నరేంద్ర మోదీ స్పష్టం చేశారు. 'ఈ రోజు అంబేడ్కర్ జయంతి. ఆయనకు నేను హృదయపూర్వక నివాళులు అర్పిస్తున్నా. అంబేడ్కర్ సామాజిక న్యాయానికి జీవితాంతం పోరాడారు. అదే దిశగా ప్రభుత్వం పనిచేస్తోంది. మౌలిక వసతులు, పరిశ్రమల అభివృద్ధి ద్వారా సమగ్ర ప్రగతి సాధ్యం అవుతుంది. ఆర్టికల్370 రద్దు తర్వాత రాజ్యాంగం పూర్తిగా అమల్లోకి వచ్చింది. మావోయిస్టు ప్రభావిత జిల్లాలు కూడా ఇప్పుడు రాజ్యాంగబద్ధంగా పనిచేస్తున్నాయి. ఉమ్మడి పౌర స్మృతిని అమలు చేయాలని మన రాజ్యాంగం మన నుంచి ఆశిస్తోంది. ఉత్తరాఖండ్ దీనిని ముందుకు తీసుకువెళ్లి దేశానికి ఒక మార్గాన్ని చూపింది' అని ప్రధాని మోదీ తెలిపారు. నాలుగు దశాబ్దాల నిరీక్షణ తర్వాత పార్లమెంట్? నారీశక్తి వందన్ అదినియం ఆమోదించిందని ప్రధాని మోదీ తెలిపారు. 'మన సోదరీమణులు, అడబిడ్డల



సంక్షేమం, రక్షణ, ప్రజాస్వామ్యంలో భాగస్వామ్యం అనేది డబుల్ సర్కార్ అత్యధిక ప్రాధాన్యాల్లో ఒకటి. శాసనసభలు, లోక్‌సభలో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు ఖరారయ్యాయి. అన్ని పార్టీలు ముందుకొచ్చి ఈ గొప్ప బిల్లుకు మద్దతు ఇచ్చాయి. మహిళలకు లభించిన ఈ హక్కు అమల్లో జాప్యం జరగడానికి వీల్లేదు. 2029లో లోక్‌సభ ఎన్నికలు జరుగుతాయి. ఆ తర్వాత అసెంబ్లీ ఎన్నికలు కూడా జరుగుతూ ఉంటాయి. 2029 నుంచే ఈ రిజర్వేషన్లు అమలు కావాలి. ఇది దేశంలో ప్రతీ సోదరి, ఆడవిడ్డ కోరిక. మాతృశక్తి ఆకాంక్షను గౌరవిస్తూ ఏప్రిల్ 16 నుంచి పార్లమెంటులో చర్చలు జరుగుతాయి. మహిళలకు సంబంధించిన ఈ పనిని అన్ని పార్టీలు కలిసి ఏకాభిప్రాయంతో పూర్తి చేయాలి' అని ప్రధాని మోదీ తెలిపారు. హరిద్వార్‌లో జరగబోయే కుంభమేళాను వైభవోపేతంగా, దివ్యంగా, పరిశుభ్రంగా నిర్వహించాలని కూడా ప్రధాని మోదీ పిలుపునిచ్చారు. 'ప్లాస్టిక్ సీసాల కుప్పలు, చెత్తా చెదారం దేవభూమి పవిత్రతకు హాని కలిగిస్తున్నాయి. అందువల్ల, మన పుణ్యక్షేత్రాలైన దేవభూమి ప్రదేశాలను పరిశుభ్రంగా, అందం గా ఉంచుకోవడం చాలా ముఖ్యం. వచ్చే ఏడాది హరిద్వార్‌లో కుంభమేళా కూడా జరగనుంది. ఈ విశ్వాస సంగమాన్ని దివ్యంగా, వైభవంగా, పరిశుభ్రంగా తీర్చిదిద్దేందుకు మనం అన్ని విధాలా కృషి చేయాలి' అని ప్రధాని మోదీ తెలిపారు.

**'ఏడాది పొడవునా టూరిజం అవసరం'**

ఉత్తరాఖండ్?లో 12 నెలల పర్యటకం రాష్ట్ర ఆర్థికాభివృద్ధికి ఎంతో కీలకమని ప్రధాని తెలిపారు. ముఖ్యంగా శీతాకాలంలో కూడా పర్యటకులను ఆకర్షించేలా రాష్ట్రం ముందుకు వస్తోందని చెప్పారు. వింటర్ టూరిజం, వింటర్ స్పోర్ట్స్, డెస్టినేషన్ వెడ్డింగ్స్‌కు ఉత్తరాఖండ్ ప్రముఖ కేంద్రంగా మారుతోందని పేర్కొన్నారు. ప్రధాని తన 2023 పర్యటనలో కైలాస్, ఓం పర్వత్ సందర్శించిన విషయాన్ని గుర్తుచేశారు. అప్పటి నుంచి యాత్రికుల సంఖ్య గణనీయంగా పెరిగిందని చెప్పారు. స్థానికులకు ఉపాధి అవకాశాలను పెంచిందని తెలిపారు. ఉత్తరాఖండ్ సహజ అందాలను, పవిత్రతను కాపాడితేనే పర్యటకం దీర్ఘకాలంగా అభివృద్ధి చెందుతుందని ప్రధాని పేర్కొన్నారు. దిల్లీ–దెహ్రాదూన్ ఎకనామిక్ కారిడార్ వల్ల ఈ రెండు నగరాల మధ్య ప్రయాణ సమయం ఆరు గంటల నుంచి సుమారు 3 గంటలకు తగ్గనుంది.

## ఈ ఏడాది సాధారణం కంటే వర్షాలు తక్కువే

**నైరుతి రుతుపవనాలపై ఎల్ నినో నీడ**
**ఎల్ నినో ఎఫెక్ట్‌పై ఐఎండీ హెచ్చరిక**
**దేశవ్యాప్తంగా వర్షపాతం తగ్గే అవకాశం**



న్యూ ఢిల్లీ, ఏప్రిల్ 14 (తీన్మార్ న్యూస్): ఈ ఏడాది వర్షాలు సాధారణం కంటే తక్కువగానే కురిసే అవకాశాలున్నాయని భారత వాతావరణ శాఖ(ఐఎండీ) తెలిపింది. దాదాపు మూడేళ్ల తర్వాత ఎల్ నినో పరిస్థితులు జూన్‌లో ఏర్పడే సూచనలు కనిపిస్తున్నాయని, దీని ప్రభావం నైరుతి రుతు పవనాలపై పడనుందని అంచనా వేసింది. సాధారణంగా జూన్ నుంచి సెప్టెంబర్ వరకు సాధారణ వర్షపాతం సరాసరిన 87 సెంటీమీటర్ల కాగా, ఈసారి 80 సెంటీమీటర్ల వర్షపాతమే నమోదయ్యే అవకాశముందని ఐఎండీ చీఫ్ మహాపాత్ర పేర్కొన్నారు. దేశంలోని అత్యధిక ప్రాంతాల్లో ఇవే పరిస్థితులుంటాయన్నారు. అయితే, ఈశాన్య, వాయువ్య, దక్షిణ భారతంలోని కొన్ని ప్రాంతాల్లో మాత్రం సాధారణం, అంతకంటే ఎక్కువ వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉందన్నారు.

## అజ్ఞాతంలో నలుగురు మావోయిస్టులు

**రాష్ట్ర పోలీస్ శాఖ వెల్లడి**
**జనజీవన స్రవంతిలో కలవండి**
**మావోయిస్టులకు తెలంగాణ డీజీపీ పిలుపు**
**ఛత్తీస్‌గఢ్ ఎన్‌కౌంటర్‌లో సిద్ధిపేట వాసి రూపీ రెడ్డి మృతి**
**నేడు స్వగ్రామానికి మృతదేహం**



తెలంగాణ బ్యూరో, ఏప్రిల్ 14 (తీన్మార్ న్యూస్): తెలంగాణాకి చెందిన నలుగురు మావోయిస్టులు మాత్రమే ఇంకా అజ్ఞాతంలో ఉన్నారని రాష్ట్ర పోలీస్ శాఖ వెల్లడించింది. కేంద్ర కమిటీ సభ్యులు ముప్పాళ్ల లక్ష్మణ రావు అలియస్ గణపతి, పసునూరి అలియాస్ నరహరి అలియాస్ సంతోష్, స్టేట్ కమిటీ సభ్యులు జడే రత్నాబాయి అలియాస్ సుజాత, వార్త శేఖర్ అలియాస్ మంగు ఉన్నారని పోలీస్ శాఖ వివరించింది సాయుధ పోరాటం విరమించి జనజీవన స్రవంతిలో కలవాలంటూ ఇప్పటికే మావోయిస్టులకు డీజీపీ పిలుపు ఇచ్చిన సంగతి తెలిసిందే. తెలంగాణా ప్రభుత్వ లొంగుబాటుతోపాటు పునరావాస విధానం ద్వారా లభించే ప్రయోజనాలు పొందాలను మావోయిస్టులకు పోలీస్ శాఖ విజ్ఞప్తి చేసిన విషయం విదితమే. మరోవైపు సోమవారం కాంకేర్ జిల్లాలో భద్రతా బలగాల కూంబింగ్ సందర్భంగా జరిగిన ఎన్‌కౌంటర్‌లో ఎల్‌ఓసీ కమాండర్ రూపీ రెడ్డి అలియాస్ రంగబోయిన భాగ్య (46) మరణించారు. సిద్ధిపేట జిల్లా మిరుదొడ్డి మండలం ధర్మారం ఆమె స్వస్థలం. రెండు దశాబ్దాలుగా ఆమె అజ్ఞాతంలో ఉంటున్నారు.

మూడు రాష్ట్రాల్లో మోస్ట్ వాంటెడ్‌గా రూపీ రెడ్డి ఉన్నారు. ఆమెపై రూ. 5 లక్షల రివార్డు ఉంది. ఆమె మృతదేహానికి ఇప్పటికే పోస్ట్‌మార్టం పూర్తయింది. మంగళవారం సాయంత్రం ఈ మృతదేహం ఆమె స్వగ్రామానికి చేరుకోనుంది. బుధవారం రూపీ మృతదేహానికి అంత్యక్రియలు నిర్వహించనున్నారు.

## ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

**మధ్యాహ్నం వేళ బయటకు రావొద్దు**
**ఉపాధి హామీ పనుల్లో జాగ్రత్తలు తప్పనిసరి**
**మంత్రి సీతక్క సూచన**



**హైదరాబాద్, ఏప్రిల్ 14 (తీన్మార్ న్యూస్):**

ఎండల్లో బయటకు రావొద్దని ప్రజలకు తెలంగాణ మంత్రి సీతక్క సూచించారు. రాష్ట్రంలో తీవ్ర ఉష్ణోగ్రతలు పెరుగుతున్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మార్గనిర్దేశం చేశారు. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు బయటకు రావొద్దని పేర్కొన్నారు. ఉదయం 6 గంటల నుంచి 10 గంటల మధ్య పనులు పూర్తి చేసుకోవాలని తెలిపారు. బయటకు వస్తే టోపీ, తలపాగా తప్పనిసరిగా ధరించాలని దిశానిర్దేశం చేశారు. ఎండదెబ్బ ప్రమాదమని ఆరోగ్య సమస్యలు వచ్చే అవకాశం ఉందని మంత్రి సీతక్క తెలిపారు. అధికారులు గ్రామాలు, పట్టణాల్లో చలివేంద్రాలు ఏర్పాటు చేయాలని ఆదేశాలు జారీ చేశారు. పంచాయతీ స్థాయిలో తాగునీటి సౌకర్యాలను కల్పించాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. అలాగే, ఉపాధి హామీ కార్మికులకు ప్రత్యేక సూచనలు చేశారు. పనిస్థలాల్లో తాగునీటి వసతి ఏర్పాటు తప్పనిసరని తెలిపారు. ఎండ ఎక్కువగా ఉన్న సమయంలో పని చేసే ప్రాంతాల్లో ఆయా జాగ్రత్తలు పాటించాలని అన్నారు. కార్మికుల ఆరోగ్యం అత్యంత ముఖ్యమని మంత్రి సీతక్క పేర్కొన్నారు.

# దోషాలను హరించే ప్రదోష వ్రతం

ప్రదోషమంటే అది ఒక కాల విశేషము. దోషాలను హరించే ప్రశస్తమైన కాలాన్ని ప్రదోషకాలం అంటారు. ప్రదోషమంటే పాప నిర్మూలన అని అర్థము. ప్రతిరోజూ సూర్యాస్తమయ సమయములో చంద్రుడి కదలికల వలన ఏర్పడునది ప్రదోషము."ప్రదోషో రజనీ ముఖం" అంటారు. అంటే ప్రదోషకాలం రాత్రికి ప్రారంభం వంటిది. ఈ సమయం లో పరమశివుడు పార్వతీదేవితో కలిసి అర్ధనారీశ్వర రూపంగా దర్శనమిస్తాడు. చంద్రుడి గతి వలన, ఏర్పడే తిథుల సంధులలో సూర్యాస్తమయము అయితే, అప్పుడు ప్రదోషము అంటారు. త్రయోదశినాడు కలిగే ప్రదోషాన్ని 'మహా ప్రదోషం' అంటారు.ప్రదోష సమయం రోజు వస్తున్న త్రయోదశి నాడు వచ్చే ప్రదోష సమయం చాలా పవిత్రమైనది. త్రయోదశి వ్రతం శివుడు ప్రధాన దేవునిగా ఆచరించే వ్రతం. త్రయోదశి నాడు చేస్తారు కనుక త్రయోదశి వ్రతం అని, శివపూజ, రాత్రి భోజనం చేయడం వల్ల ప్రదోష వ్రతం అని అంటారు. త్రయోదశి వ్రతం ఆచరించడం వల్ల మహాశివుడు ప్రసన్నం అవుతాడు. సకల సుఖాలు, సర్వ సంపదల కోసం ఈ వ్రతం చేస్తారు. ప్రదోషం అంటే దోషాలను తొలగించేది అని అర్థం. ప్రతి రోజూ సూర్యాస్తమయ కాలంలో దాదాపు ఆరు ఘడియల అంటే రెండు గంటల 24 నిమిషాల సమయాన్ని ప్రదోష కాలంగా పరిగణిస్తారు. ప్రదోష కాలములో త్రయోదశి తిథి ఉంటే దానిని మహా ప్రదోషం అంటారు. మహా ప్రదోషం రోజున శివ భక్తులు ప్రదోష వ్రతాన్ని ఆచరిస్తారుస్కంద పురాణంలో ప్రదోష మహత్య కథ కూడా వివరింప బడింది. రెండు త్రయోదశి తిథులలో (శుక్ల పక్షము/ కృష్ణ పక్షము) ప్రదోష వ్రతాన్ని ఆచరిస్తారు. కొన్ని ప్రాంతాలలో మాత్రం కేవలం కృష్ణ పక్ష ప్రదోషం రోజును మాత్రమే పాటిస్తారు. అన్ని పూజలు, వ్రతాల వలె త్రయోదశి వ్రతాన్ని ఉదయం వేళ కాకుండా, సూర్యాస్తమయం నుండి రాత్రి రెండు ఘడియల లోపు ఈ పూజ చేస్తారు. ఏ నెలలో అయినా త్రయోదశి నాడు ఈ వ్రతం చేసుకోవచ్చు. అయితే ఇది సుదీర్ఘకాలంపాటు చేయాల్సిన వ్రతం. ప్రతినెలలో వచ్చే రెండు త్రయోదశుల్లోనూ త్రయోదశి వ్రతం చేయాలి. అలా 11 సంవత్సరాల పాటు ఆచరించాలి. ఏదయినా ఆటంకం వచ్చి మధ్యలో చేయలేకపోతే ఉద్యాపన చేసి ప్రతిమను విసర్జించవచ్చు. ప్రదోషకాలంలో పరమేశ్వరుడు ఏకకాలంలో రెండు రూపాల్ని ప్రదర్శిస్తూ ఎడమభాగాన పార్వతి రెండవ భాగమున పరమేశ్వర రూపంగా "అర్ధనారీశ్వరుడుగా" దర్శనమిచ్చేకాలం. ప్రదోష సమయంలో శివుడు అర్ధనారీశ్వర రూపంలో ఆనంద తాండవ నృత్యం చేస్తాడని నృత్యరత్నావళి లో చెప్పబడింది. ప్రదోష సమయంలో సమస్త దేవతలందరూ శివుడిని అర్చిస్తారని భావిస్తారు. ప్రదోష సమయంలో చేసే శివారాధన ఉత్తమమని చెప్పబడుతుంది. ఈ సమయంలో శివారాధన చేయటాన్ని సమస్త దేవతలను పూజించటంతో సమానంగా భావిస్తారు. మహాశివుడు అభిషేక ప్రియుడు కనుక మంత్రోక్తంగా పంచామృతాలతో ఆయనను అభిషేకించాలి. వీలు పడని వారు ఆలయానికి వెళ్ళి ప్రదోష సమయం లో అభిషేకం చేయించవచ్చు.ప్రదోషకాలం లో శివప్రదోష స్తోత్రాన్ని పఠించడం వలన విశేష ఫలితాలు పొందవచ్చు.ప్రదోష సమయంలో శివాలయాలలో జరిగే అభిషేకాలను దర్శించే వారికి సకల సంపదలు సిద్ధిస్తాయని భావిస్తారు. ఈ సమయంలో శివుడితో పాటు నందీశ్వరుడిని కూడా ఆరాధిస్తారు. నందీశ్వరుడు నాలుగు వేదాలు, 64 కళలను అభ్యసించిన నిష్ణాతుడైనప్పటికీ, వినయంతో వుండి, శివునికి ఏర్పడిన అనుమానాలను కూడా నివృత్తి చేస్తాడని విశ్వసిస్తారు. అందువల్ల నందీశ్వరుడిని ఆరాధించడం వలన బుద్ధికుశలత, మానసిక ఉల్లాసం లభిస్తాయి. త్రయోదశి తిథి ఆదివారం రోజు వస్తే దానిని రవి ప్రదోషం అని, సోమవారం రోజు వస్తే దానిని సోమ ప్రదోషమనీ, మంగళవారం రోజు వస్తే దానిని భౌమ ప్రదోషమని, బుధవారం రోజు వస్తే దానిని బుధ ప్రదోషమని, గురువారం రోజు వస్తే దానిని గురు ప్రదోషమని, శుక్రవారం రోజు వస్తే దానిని శుక్ర ప్రదోషమని, శనివారం రోజు వస్తే దానిని శని త్రయోదశి అనీ, శని ప్రదోషమని పిలుస్తారు. దేవ దానవులు క్షీర సాగరాన్ని మథించినప్పుడు వెలువడిన హాలాహలం నుండి శివుడు ప్రపంచాన్ని రక్షించిన రోజుగా శనిప్రదోషం రోజును చెబుతారు. శని కర్మకారకుడు, శివుడు సంహార కారకుడు కావున శని ప్రదోష సమయాన శివారాధన చేయడం ఉత్తమంగా పరిగణిస్తారు. సోమవారం శివుడికి ప్రీతికరమైనది. కాబట్టి ఆ రోజున వచ్చే సోమ ప్రదోషమును ప్రశస్తమైనదిగా భావిస్తారు. ఈ రోజున ప్రదోష వ్రతము ఆచరించటం వలన మనసులోని మలినాలన్నీ తొలగిపోతాయి .త్రయోదశీ ప్రదోషము గురువారం వస్తే ఆ రోజును గురు త్రయోదశిగా భావిస్తారు. గురు ప్రదోష పూజ వలన విద్యాబుద్ధులు, సంపదలు కలుగుతాయని చెబుతారు. జాతకములో ఉండే గురు దోషములకు రుద్రారాధన విరుగుడుగా భావిస్తారు. ప్రదోషం రోజు ఉదయమే స్నానం చేసి తెల్లని వస్త్రాలను ధరించి, శరీరంపై విభూతిని, రుద్రాక్షమాలను కూడా ధరించటం మంచిది. ఆ రోజులో వీలైనప్పుడల్లా పంచాక్షరి మంత్రాన్ని (ఓ నమ:శివాయ) జపం చేయాలి. ప్రదోషం రోజున నిశ్శబ్దంగా ఆరాధించటాన్ని శివుడు ఇష్టపడతాడని చెబుతారు. కఠిన ఉపవాసం చేయలేనివారు పండ్లు, పాలు లాంటివి తీసుకోవచ్చు. ఉడికించిన పదార్థాలను తీసుకోకూడదు. సాయంకాలం ప్రదోష సమయంలో స్నానమాచరించి శివ షోడశోపచార పూజ జరపాలి. ప్రదోషం రోజు ఆ పరమ శివుడికి నేతి దీపారాధన, ఆవుపాలతో అభిషేకం అభిషేకం చేయటం, బిల్వ పత్రాలు మరియు శంఖుపూలతో అర్చించటం శ్రేయస్కరం. మహా మృత్యుంజయ మంత్రాన్ని ...ఓం త్రయంబకం యజామహే, సుగంధిం పుష్టి వర్ధనం, ఊర్వారుకమివ బంధనాత్, మృత్యోర్ముక్షీయ మామృతాత్.... మహా మృత్యుంజయ మంత్రము పఠించాలి.... 108 సార్లు జపించి ప్రదోష కథను వినటంగానీ చదవటం గానీ చేయాలి. ఇంటిలో పూజ ముగించిన అనంతరం శివాలయాన్ని దర్శించాలి. వీలైనవారు ప్రదోష స్తోత్రం, శివ స్తోత్రములను కూడా పఠించాలి.

# అవయవదానంపై అపోహలు తొలగాలి

నిత్యం రద్దీగా ఉండే హైదరాబాద్ మహానగరంలోని ప్రధాన రోడ్లపై నిర్దిష్ట 14 కి.మీ దూరంలోని ఆసుపత్రికి 22 నిమిషాల్లో చేరుకుని ఐదుగురు రోగుల ప్రాణాలను కాపాడిన సంఘటన ఇటీవల చోటుచేసుకుంది. రోడ్డు ప్రమాదాల్లో మరణిస్తున్నవారి అవయవాలను దానం చేస్తుడడం నిత్యం చదువుతూ ఉన్నాం. ఇలాంటి సంఘటనలు 'అవయవ దానం' కు ప్రాణం పోస్తూ స్ఫూర్తిగా నిలుస్తున్నాయి. చావుబతుకుల మధ్య కొట్టుమిట్టాడుతున్న ఓ మనిషికి, మరణించిన మనిషి ప్రాణంపోయడం మానవత్వానికి ఉన్న గొప్ప గుణంగా భావించాలి. మరణించిన మనిషి తాలూకూ అవయవాలను నిర్దిష్ట సమయంలో మరో మనిషికి అమర్చడంవల్ల ఓ కొత్త జీవితం అందుతుంది. మరణం అంచున ఉండేవారికి రెండవ జీవితాన్ని ప్రసాదించడం 'పునర్జన్మ'గానే భావించాలి. ఇటీవలికాలంలో దేశవ్యాప్తంగా అవయవ దానంపై కొంతసానుకూల వాతావరణం ఏర్పడుతోంది. 2013లో అవయవదాతల సంఖ్య 5 వేల లోపు ఉండగా, 2025లో నాలుగు రెట్లు పెరిగి 20 వేలకు చేరింది. దేశవ్యాప్తంగా పన్నెండు వందల కుటుంబాలు అవయవాలు దానం చేసి ఇతరుల జీవితాల్లో వెలుగులు నింపారు. అత్యధిక అవయవదానం చేసిన రాష్ట్రాల్లో తెలంగాణ రెండవ స్థానంలో నిలిచింది. ఇది జాతీయ సగటుకన్నా ఎక్కువ కావడం విశేషం. మధుమేహం, అధిక రక్తపోటు తదితర కారణాల వల్ల దేశవ్యాప్తంగా పెద్ద సంఖ్యలో కిడ్నీ, కాలేయం, గుండె తదితర వ్యాధులకు గురవుతున్న వారి సంఖ్య ప్రతి ఏటా పెరిగిపోతున్నాయి. సరిపడ అవయవాల లభ్యత లేనందువల్ల ఏటా అయిదు లక్షలమంది నిస్సహాయస్థితిలో ప్రాణాలు కోల్పోతున్నారు. మనిషి జీవించినప్పుడు రక్తదానంతో పాటు కిడ్నీ, కాలేయం, గర్భాశయం, గర్భధారణ కణజాలం దానం చేయవచ్చు. బ్రెయిన్‌డెడ్ అయితే మూత్రపిండాలు, కాలేయం, ఊపిరితిత్తులు, గుండె, గుండె కవాటాలు, పేగులు, క్లోమం, కార్నియా ఇతరులకు ఉపయోగపడుతాయి. గుండె ఆగి మరణించిన వారైతే కళ్లు, చర్మం, గుండె, కవాటాలు, ఎముకలు వంటి కణజాలాలు వంటి అవయవాలు మాత్రమే కాకుండా, మొత్తం శరీరాన్ని కూడా దానం చేయవచ్చు.

బ్రెయిన్ డెడ్‌గా నిర్ధారించిన వ్యక్తి నుంచి సేకరించిన అవయవాలను నిర్దేశిత సమయాల్లో అవసరమైన వారికి అమర్చాలి. ఆలస్యమైతే అవి పాడైపోయే ప్రమాదముంది. ఒక దాత ఎనిమిదిమంది ప్రాణాలను కాపాడటానికి ఆస్కారముంది. అలాగే సహజ మరణం చెందిన కొద్ది నిమిషాల్లో కళ్లు. కణజాలం (టిష్యూ) సేకరించవచ్చు. కానీ, ప్రజల్లో సరైన అవగాహన లేకపోవడం, అపోహల వల్ల అవయవదానం చేస్తున్నవారి సంఖ్య ఆశించినమేరకు పెరగడం లేదు. 2023లో పదివేల మంది మహిళలు జీవించి ఉండగానే అవయవదానం పత్రాలమీద సంతకం చేసినట్లు కేంద్ర ఆరోగ్య కుటుంబ సంక్షేమశాఖ నివేదిక తెలిపింది. పురుషులతో పోల్చితే ఈ సంఖ్య దాదాపు రెట్టింపు. దేశవ్యాప్తంగా ఏటా రోడ్డు ప్రమాదాల్లో ఒకటిన్నర లక్షల మందికిపైగా మరణిస్తున్నారు. సంబంధిత కుటుంబాలకు నచ్చజెప్పి మృతుల్లో కొందరి అవయవాలను మార్పిడి చేసినా అభాగ్యులెందరికో కొత్త ఊపిరి అందుతుంది. కానీ, బ్రెయిన్‌డెడ్ కేసులను సత్వరం గుర్తించడంతోపాటు వారి కుటుంబ సభ్యులను ఒప్పించడంలో నిర్లక్ష్యం నెలకొంటోంది. అవయవ దానం చేసేందుకు ఎవరైనా ముందుకు రావచ్చు. 18 ఏళ్లు పైబడిన ప్రతి వ్యక్తి అవయవదానం కోసం తమ పేరును నమోదు చేసుకోవచ్చు. 18 ఏళ్లలోపు ఉండేవారు తమ అవయవాలను దానం చేయడానికి అతని తల్లిదండ్రులు లేదా సంరక్షకుల అనుమతి ఉండాలి. మరణానంతరం అవయవ దానం కోసం నమోదు చేసుకుంటే, ముందుగా ఆ వ్యక్తిని వైద్యులు తనిఖీ చేస్తారు. ఆ వ్యక్తికి ఉన్న అనారోగ్య సమస్యలను అంచనా వేసి ఏ అవయవాలను దానం చేయవచ్చో తెలియజేస్తారు. తీవ్ర ప్రమాదం లేదా ఏదైనా వ్యాధి కారణంగా కోమాలోకి వెళ్లి, మళ్లీ స్పృహలోకి రాలేని పరిస్థితిలో ఉన్న బాధితుడిని బ్రెయిన్‌డెడ్‌గా నిర్ధారిస్తారు. ఆసుపత్రిలో వెంటిలేటర్ సహాయంతో వారి గుండె ఇంకా కొట్టుకుంటూ, ఇతర ముఖ్య అవయవాలు మాత్రం కొన్ని గంటలపాటు పనిచేస్తూనే ఉంటాయి. వీటిని కుటుంబ సభ్యుల అనుమతితో సేకరించి, బ్లడ్‌గ్రూప్ తదితర అంశాలు సరిపోలిన వారికి నిర్దేశిత సమయంలో అమర్చుతారు.

బ్రెయిన్‌డెడ్‌గా ధ్రువీకరించడానికి ఒకరి కంటే ఎక్కువ మంది వైద్యనిపుణులతో కూడిన బోర్డు అనుమతి తప్పనిసరిగా ఉండాలి. అవయవాల సేకరణ, నిల్వ, తరలింపు, వాణిజ్యప రంగా వాటి దుర్వినియోగం వంటివాటిని నియంత్రించడానికి 1994లో మానవ అవయవాలు, కణాల మార్పిడి చట్టం తీసుకువచ్చింది. 2011లో దీనికి సవరణలు చేశారు. అవయవాల సేకరణ, కేటాయింపు, తరలింపును జాతీయ అవయవ, కణజాల మార్పిడి సంస్థ (ఎన్ఓటిటిఓ) పర్యవేక్షిస్తోంది. తెలుగు రాష్ట్రాల్లో అవయవ దానానికి 'జీవన్‌దాన్' ఎంతగానో కృషి చేస్తోంది. మరికొన్ని స్వచ్ఛంద సంస్థలూ పాటుపడుతున్నాయి. మరణించిన వ్యక్తుల అవయవ దానాన్ని ప్రోత్సహించేందుకు 2019లో కేంద్రం ప్రత్యేక కార్యక్రమాన్ని చేపట్టింది. ఈమేరకు అవయవాల అందుబాటును పెంచాలనేది జాతీయ అవయవ మార్పిడి కార్యక్రమ ఉద్దేశం. జాతీయ, ప్రాంతీయ, రాష్ట్ర స్థాయి అవయవ, కణజాల మార్పిడి సంస్థలు అవయవాల సేకరణ, పంపిణీకి సంబంధించిన సమన్వయ బాధ్యతల్ని నిర్వర్తిస్తున్నాయి. అవయవాలను అత్యంత తక్కువ సమయంలో సురక్షితంగా అందించడమే దీని ప్రధాన లక్ష్యం. ఈమేరకు ప్రజలు వెబ్‌సైట్ ద్వారా అవయవ దానానికి 'ఎన్ఓటిటిఓ'ను తీసుకొచ్చింది. దాత నుంచి సేకరించే అవయవాలను గ్రహీత ఉండే ఆస్పత్రికి చేర్చే ప్రక్రియలో అంబులెన్సులకు ఎలాంటి అడ్డంకులు లేకుండా గ్రీన్‌కారిడార్ పేరిట ప్రత్యేక మార్గాన్ని కల్పించారు. అంతేకాకుండా 'ఒకే దేశం ఒకే విధానం' కార్యక్రమాన్ని తీసుకొచ్చింది. దీంతో భారతీయులంతా రాష్ట్రాలతో సంబంధం లేకుండా ఎక్కడైనా దరఖాస్తు చేసుకోవచ్చు. 65 ఏళ్ల గరిష్ట వయోపరిమితిని తొలగించడం వల్ల ఎవరైనా, ఎక్కడైనా గ్రహీతలుగా అర్హులే. ఈ నేపథ్యంలో అవయవ దానంపైన ప్రచారోద్యమం ముమ్మరంగా సాగాలి. ప్రాథమిక పాఠశాల స్థాయి నుంచే విదార్థులకు అవయవదానంపై అవగాహన కల్పించాలి. ఎవరికైనా అపోహలుంటే తొలగించాలి. సామాజిక మాధ్యమాలు, ఇతరత్రా వేదికల ద్వారా ప్రచారం పెంచాలి. ఇందుకోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేయాలి.

# నిజాం సామ్రాజ్య నిర్మాణ శిల్పి

హైదరాబాద్ రాజ్య చరిత్రలో అసఫ్ జాహీ వంశీయుల పాలన ఒక స్వర్ణయుగమైతే, ఆ పాలనకు వెన్నెముకగా నిలిచి, అస్థిరతలో ఉన్న రాజ్యాన్ని సుస్థిరత వైపు నడిపించిన ధీశాలి మహారాజా చందు లాల్. క్రీస్తుశకం 1766లో జన్మించి, 1845 ఏప్రిల్ 15న పరమపదించిన ఆయన జీవితం ఒక సామాన్య ఉద్యోగి నుంచి అసాధారణ రాజనీతిజ్ఞుడి వరకు సాగిన స్ఫూర్తిదాయక ప్రయాణం. నిజాం ఉల్ ముల్క్ ఆస్థానంలో కీలక బాధ్యతలు నిర్వహించిన చందు లాల్, తన రాజకీయ చతురతతో, పరిపాలనా దక్షతతో దాదాపు మూడు దశాబ్దాల పాటు దివాన్‌గా (ప్రధాన మంత్రి) వ్యవహరించి చరిత్రలో చెరగని ముద్ర వేశారు. కేవలం ఒక అధికారిగానే కాకుండా, కవిగా, కళా పోషకుడిగా, లౌకికవాదిగా ఆయన నిర్వహించిన పాత్ర బహుముఖీనమైనది. మహారాజా చందు లాల్ పూర్వీకులు ఉత్తర భారతదేశంలోని రాయ్‌బరేలీ ప్రాంతానికి చెందిన మల్హోత్రా ఖత్రీ కుటుంబీకులు. ఆయన తాత రాయ్ నానక్ రామ్ నిజాం ఉల్ ముల్క్ ఆసఫ్ జా ఎ కాలంలో దక్కన్‌కు వలస వచ్చారు. చందు లాల్ తన వృత్తి జీవితాన్ని కస్టమ్స్ శాఖలో ఒక సాధారణ ఉద్యోగిగా ప్రారంభించారు. క్రమంగా తన మేధస్సుతో, అంకితభావంతో నిజాం సికిందర్ జా దృష్టిని ఆకర్షించి, 1809లో 'పేష్కార్' (డిప్యూటీ మినిస్టర్) పదవిని అధిరోహించారు. ఆ సమయంలో దివాన్‌గా ఉన్న మునీర్ ఉల్ ముల్క్ నామమాత్రపు అధికారిగా ఉండగా, అసలు అధికారమంతా చందు లాల్ చేతుల్లోనే ఉండేది. 1832లో ఆయన అధికారికంగా దివాన్ బాధ్యతలు స్వీకరించి 1843 వరకు ఆ పదవిలో కొనసాగారు. ఆయన పదవీ కాలం అత్యంత క్లిష్టమైన పరిస్థితులతో కూడుకున్నది. ఒకవైపు నిజాం అంతర్గత వ్యవహారాలు, మరోవైపు ఈస్ట్ ఇండియా కంపెనీ పెరుగుతున్న ఆధిపత్యం మధ్య రాజ్య స్వయంప్రతిపత్తిని కాపాడటం ఆయనకు కత్తిమీద సాములా మారింది. ఆర్థికంగా కునారిల్లిన రాజ్యాన్ని గట్టెక్కించడానికి ఆయన అనేక సంస్కరణలు ప్రవేశపెట్టారు. ముఖ్యంగా 'తాలూక్ దారీ' వ్యవస్థ ద్వారా భూమి శిస్తు వసూళ్లను క్రమబద్ధీకరించారు. అయితే, బ్రిటిష్ సైన్యం (హైదరాబాద్ కంటెంజెంట్) ఖర్చులు భరించడం వల్ల రాజ్యం తీవ్రమైన అప్పుల ఊబిలో



చిక్కుకుంది. పామర్ అండ్ కో వంటి బ్యాంకుల నుంచి అప్పులు తీసుకోవడం, అధిక వడ్డీలు చెల్లించడం వంటి పరిణామాలు రాజ్య ఆర్థిక స్థితిని దెబ్బతీశాయి. ఈ ఆర్థిక ఒత్తిడిని అధిగమించడానికి ఆయన పన్నుల భారాన్ని పెంచాల్సి వచ్చింది, ఇది ప్రజా సామాన్యంలో కొంత అసంతృప్తికి కారణమైనప్పటికీ, పరిపాలనా యంత్రాంగం ఆగకుండా నడపడంలో ఆయన విజయం సాధించారు.

శాంతి భద్రతల విషయంలో చందు లాల్ కఠిన వైఖరిని అవలంబించారు. రాజ్యంలోని వివిధ ప్రాంతాల్లో తలెత్తిన తిరుగుబాట్లను అణచి వేయడంలో ఆయన వ్యూహకర్తగా వ్యవహరించారు. న్యాయ వ్యవస్థను వికేంద్రీకరించి, సామాన్యులకు సైతం న్యాయం చేకూరేలా 'అదాలత్'లను బలోపేతం చేశారు. హైదరాబాద్ నగర సుందరీకరణలో కూడా ఆయన పాత్ర మరువలేనిది. నాటి మొఘల్ సంస్కృతికి, దక్కన్ ఆచారాలకు మధ్య వారధిగా ఉంటూ, హిందూ-ముస్లింల మధ్య సామరస్యాన్ని పెంపొందించారు.

ఆయన స్వయంగా హిందువైనప్పటికీ, నిజాం పట్ల చూపిన విశ్వాసం, ఇస్లామిక్ సంప్రదాయాల పట్ల చూపిన గౌరవం ఆయనను అందరివాడిగా నిలబెట్టాయి. 'షదాన్' అనే కలం పేరుతో ఆయన ఉర్దూ, పర్షియన్ భాషల్లో అద్భుతమైన కవిత్వం రాశారు. ఆయన ఆస్థానం నిరంతరం కవులు, పండితులు, కళాకారులతో కళకళలాడుతూ ఉండేది. భగవంతుడిపై భక్తితోపాటు, మానవతా దృక్పథం కలిగిన ఆయన, అనేక దేవాలయాలకు, మసీదులకు భూరి విరాళాలు ఇచ్చారు. ?బ్రిటిష్ వారితో ఆయనకు ఉన్న సంబంధాలు చరిత్రకారుల మధ్య చర్చనీయాంశంగా మిగిలాయి. రెసిడెంట్ హెన్రీ రస్సెల్ వంటి బ్రిటిష్ అధికారులతో ఆయన అత్యంత సన్నిహితంగా ఉండేవారు. ఇది రాజ్య రక్షణకు అవసరమని ఆయన భావించినప్పటికీ, పరోక్షంగా బ్రిటిష్ ప్రభావం నిజాం పాలనలో పెరగడానికి దారితీసింది. 1843లో రాజ్య ఆర్థిక సంక్షోభం ముదిరిన తరుణంలో, నిజాం నశీరుద్దౌలాతో ఏర్పడిన అభిప్రాయభేదాల కారణంగా ఆయన తన పదవికి రాజీనామా చేశారు. పదవి నుంచి తప్పుకున్నాక కూడా ఆయన గౌరవం ఏమాత్రం తగ్గలేదు. మహారాజా చందు లాల్ వారసత్వం నేటికీ హైదరాబాద్ నగరంలో సజీవంగా ఉంది. ఆయన నిర్మించిన భవనాలు, ప్రోత్సహించిన సాహిత్య ప్రక్రియలు దక్కన్ సంస్కృతిలో అంతర్భాగమయ్యాయి. ఆయన కాలంలోనే హైదరాబాద్ రాష్ట్రం ఆధునిక పరిపాలనా పద్ధతులకు పునాది వేసుకుంది. అధికార దాహం కంటే రాజ్య శ్రేయస్సు మిన్న అని నమ్మిన అరుదైన రాజకీయ నాయకుడు ఆయన. 1845లో ఆయన కన్నుమూసినప్పుడు, ఒక గొప్ప రాజనీతిజ్ఞుడిని, అంతకంటే గొప్ప మానవతావాదిని హైదరాబాద్ కోల్పోయింది. ఆయన వర్ధంతి సందర్భంగా చందు లాల్ చేసిన సేవలను స్మరించుకోవడం అంటే, హైదరాబాద్ ఘనమైన చరిత్రను, లౌకిక వారసత్వాన్ని గౌరవించడమే. ఒక సాధారణ వ్యక్తి శిఖరాగ్రానికి చేరి, దేశ చరిత్రలో తనకంటూ ఒక ప్రత్యేక పేజీని లిఖించుకోవడం చందు లాల్ ప్రతిభకు నిదర్శనం. నేటి పాలనా రంగంలో ఉన్నవారికి ఆయన ఆర్థిక క్రమశిక్షణ (ప్రయత్నాలు), దౌత్య నీతి, మత సామరస్యం వంటి అంశాలు నేటికీ పాఠాలుగా నిలుస్తాయి.

# ప్రభుత్వ నిర్లక్ష్యం.. విద్యార్థులపై భారం!

ఇటీవల రాష్ట్రంలో ఉన్నత విద్యను అభ్యసిస్తున్న ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాల విద్యార్థులకు సంబంధించిన ఫీజు రీయింబర్స్‌మెంట్ వ్యవస్థ తీవ్ర సంక్షోభాన్ని ఎదుర్కొంటోంది. ప్రభుత్వం చెల్లించాల్సిన ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు సంవత్సరాలుగా చెల్లించకపో వడంతో విద్యార్థులు, విద్యాసంస్థలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నాయి.. ఫలితంగా ప్రైవేటు కళాశాలలు నేరుగా విద్యార్థుల నుంచే ట్యూషన్ ఫీజులు వసూలు చేయడం ప్రారంభించాయి. ఫీజు చెల్లించలేని విద్యార్థుల నుండి బాండ్ అఫిడవిట్లు తీసుకుని, సర్టిఫికెట్లు ఇవ్వకుండా వేధించే పరిస్థితులు ఏర్పడ్డాయి. ఈ బకాయిలు సరిగ్గా విడుదల చేయకపోవడంతో ప్రభుత్వ కళాశాలలు సైతం ఆర్థిక సంక్షోభంలో కూరుకుపోయాయి. చిన్న ప్రైవేటు విద్యాసంస్థలు వడ్డీలకు అప్పులు తెచ్చుకొని నిర్వహణ సాగిస్తున్నాయి. ఇదే సమయంలో, ప్రభుత్వ జీవోల ప్రకారం విద్యార్థుల నుండి ఫీజులు వసూలు చేయరాదనే నిబంధనల కారణంగా ప్రైవేటు కళాశాలలు తమ కార్యకలాపాలను కొనసాగించలేకపోతున్నామని ఇటీవలే కోర్టును ఆశ్రయించి విద్యార్థుల నుంచే ఫీజులు వసూలు చేసుకునే అనుమతిని ఇవ్వాలని పిటిషన్ దాఖలు చేశాయి. అయితే ప్రభుత్వం తరఫున కౌంటర్ అఫిడవిట్ సమర్పణలో జాప్యం జరగడం, పలుమార్లు అవకాశం ఇచ్చినప్పటికీ ప్రభుత్వం కౌంటర్ దాఖలు చేయకపోవడంతో, కోర్టు పిటిషనర్ల అభ్యర్థనను మధ్యంతర చర్యగా ఆమోదించింది. ఈ ఆదేశాలు 2026-27 విద్యా సంవ త్సరానికి వర్తించనున్నాయి. ఈ నెల 30లోగా కౌంటర్ దాఖలు చేయాలని ప్రభుత్వానికి మరో అవకాశం ఇచ్చింది. అయితే ఈ జాప్యం ప్రభుత్వ వైఖరిపై అనుమానాలు కలిగిస్తోంది. ప్రస్తుతం పరిస్థితి చూస్తే, ఒకవైపు ప్రభుత్వం ప్రైవేటు విద్యాసంస్థల్లో చేరేందుకు ప్రోత్సహిస్తూనే, మరోవైపు తగిన ఆర్థిక మద్దతు అందించడంలో విఫలమవుతోంది. గ్లోబలైజేషన్, మార్కెటీకరణ ప్రభావంతో విద్య, వైద్యం వంటి సేవా రంగాల నుండి ప్రభుత్వం క్రమంగా వైదొలుగుతోంది. ప్రభుత్వ విశ్వవిద్యాలయాలకు తగిన మౌలిక సదుపాయాలు, సిబ్బంది లేకపోవడం పరిస్థితిని మరింత దిగజారుస్తోంది. అదే సమయంలో ప్రైవేటు ఇంజనీరింగ్ కళాశాలలు భారీ ఫీజులు వసూలు చేస్తూ, విద్యను పేదలకు అందకుండా చేస్తున్నాయి. విద్యారంగం లాభాపేక్షకు లోబడి ఉండకూడదనే సూత్రాన్ని 'మోడ్రన్ డెంటల్ కాలేజ్ అండ్ రీసెర్చ్ సెంటర్ ఒ ఇతరులు వర్సెస్ స్టేట్ ఆఫ్ మహారాష్ట్ర -2009' కేసు స్పష్టం చేసినప్పటికీ, ప్రస్తుత పరిస్థితుల్లో పెట్టుబడిదారులు విద్యను వ్యాపారంగా మార్చేశారు.. ఇటీవల హైకోర్టు ఇచ్చిన మధ్యంతర ఆదేశాలు కూడా ఈ ధోరణికి చట్టబద్ధత కల్పిస్తున్నాయనే విమర్శలు వినిపిస్తున్నాయి. గతంలో విద్యార్థి సంఘాలు, కళాశాల యాజమాన్యాలు చేపట్టిన ఆందోళనల నేపథ్యంలో ప్రభుత్వం కొంత మేర నిధులు విడుదల చేసింది. అయితే అవి మొత్తం బకాయిలతో పోలిస్తే చాలా తక్కువగా ఉన్నాయి. అందుకే ప్రభుత్వం ప్రతీ విద్యా సంవత్సరం పూర్తయ్యేలోపు మొత్తం ఫీజులను విడుదల చేసే విధానాన్ని అమలు చేయాల్సిన అవసరం ఉంది. అలాగే ప్రభుత్వ విద్యాసంస్థల్లో ఉచిత ఉన్నత విద్యను అందిస్తే ప్రభుత్వంపై భారం తగ్గుతుంది. దీనిని అన్ని ప్రభుత్వాలు అమలు చేసేలా చట్టబద్ధత కల్పించాలి. అలాగే కోర్టు సైతం మాండమస్ రిట్ (ప్రభుత్వ సంస్థలు తమ బాధ్యతలను నిర్వర్తించేందుకు కోర్టు ఇచ్చే ఆదేశం) జారీ చేసి పెండింగ్‌లో ఉన్న బకాయిలను తక్షణమే విడుదల చేయాలని, భవిష్యత్తులో ఈ సమస్య పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని ఆదేశించాల్సిన అవసరం ఉంది. లేకపోతే, సామర్థ్యం లేని పేదలకు ఉన్నత విద్య అందని ద్రాక్షగా మారుతోంది.

# ఘనంగా డాక్టర్ బిఆర్ అంబేద్కర్ 135వ జయంతి

**అంబేద్కర్ ఆశయాలకు అనుగుణంగా ప్రణాళికలు చేసుకోవాలి**

**ప్రభుత్వ విప్ డాక్టర్ జాటోత్ రామచంద్రునాయక్**

**ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలి**

**జిల్లా కలెక్టర్ అండ్ మెజిస్ట్రేట్ స్నేహ శబరీష్**

మహబూబాబాద్ జిల్లా, ఏప్రిల్ 14 (తీన్మార్ న్యూస్): అంబేద్కర్ జయంతి ఉత్సవాల సందర్భంగా పట్టణంలోని కోర్టు సెంటర్లో భారత రత్న బిఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించిన ప్రభుత్వ విప్ డోర్నకల్ ఎమ్మెల్యే డాక్టర్ జాటోత్ రామచంద్రునాయక్, ఎమ్మెల్సీ తక్కెళ్ళపల్లి రవీందర్ రావు, జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్, అనంతరం నిర్వహించిన ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా రవాణా శాఖ ఆధ్వర్యంలో రహదారి భద్రతా ప్రతిజ్ఞ చేయించారు. రోడ్డు భద్రతా నియమాలను పాటించడం, ఇతరులకు తెలియజేయడం, తోటి రోడ్డు వినియోగదారులను గౌరవించడం, ప్రమాదాలను నివారించడం వంటి అంశాలపై ప్రతిజ్ఞ చేయబడింది. ప్రతి పౌరుడు ట్రాఫిక్ నియమాలను కచ్చితంగా పాటించి, రోడ్డు భద్రతకు సహకరించాలని కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమం ద్వారా ప్రజల్లో రహదారి భద్రతపై అవగాహన పెంపొందించడమే ప్రధాన లక్ష్యమని తెలియజేశారు.

**రహదారి భద్రతా ప్రతిజ్ఞ**

నేను భారతదేశ పౌరుడిగా, మోటారు వాహనముల చట్టంలో పొందుపరిచిన రోడ్డు నియమ నిబంధనలను పాటిస్తానని, ఇతరులకు తెలియజేస్తానని, తోటి రోడ్డు వినియోగదారులను గౌరవిస్తానని, రోడ్డు ప్రమాదములు జరుగకుండా నా కర్తవ్యాలను శ్రద్ధతో, అంతఃకరణశుద్ధితో నిర్వహిస్తానని, రోడ్డుపై ప్రయాణించినపుడు ట్రాఫిక్ నియమాలను ఉల్లంఘన గాని, ప్రేరేపించడం గాని లేకుండా ప్రజలందరూ మన రోడ్లపై సురక్షితంగా ప్రయాణం చేయడానికి సహకరిస్తానని దైవసాక్షిగా ప్రమాణం చేస్తున్నాను. అనంతరం కలెక్టరేట్ ప్రధాన సమావేశ మందిరంలో కుల సంఘాల ప్రతినిధులు జిల్లాలోని ప్రజలు అన్ని విభాగాల సిబ్బంది తో కలిసి అంబేద్కర్ జయంతి వేడుకలను జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ డాక్టర్ జాటోత్ రామచంద్రునాయక్ మాట్లాడుతూ ప్రస్తుత యువత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ఆశయాల కలుగునంగా ప్రణాళికలు సిద్ధం చేసుకుని ముందుకు సాగాలని ఆయన చూపిన అంటరానితనం, కుల వివక్షత తదితర అంశాలపై ఇప్పటికీ చేస్తున్న కృషి ఆయన చలివే అని అన్నారు. యువత చెడు వ్యసనాలకు బానిసలు కాకుండా తల్లిదండ్రులను గౌరవిస్తూ మంచి ఉన్నతమైన చదువులు చదివి గొప్ప స్థాయికి చేరుకోవాలని అన్నారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వం ప్రజలకు అత్యంత ముఖ్యమైన పథకాలు అంశాలను చేరవేస్తూ అవగాహన కల్పిస్తుందని అన్నారు రోడ్, ఫుడ్ సేఫ్టీ, డ్రగ్స్ నిర్మూలన, వైద్య శిబిరాలు, తదితర ప్రత్యేక ప్రణాళిక ద్వారా ప్రజల్లో అవగాహన కల్పిస్తూ పథకాలను అమలు చేస్తుందన్నారు. జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ మాట్లాడుతూ ప్రపంచంలో అన్ని దేశాలకు ఆదర్శం భారత రాజ్యాంగం అని రాజ్యాంగం ద్వారా ఏర్పడిన యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ అత్యున్నతమైన స్థానంలో ఉన్నటువంటి యూపీఎస్సీ రాజ్యాంగం ద్వారానే ఏర్పడిందని, అట్టి సంస్థ ద్వారా దేశంలోనే అత్యున్నత సర్వీసులలో ఉత్తీర్ణత పొంది ప్రజలకు సేవ చేయడం ద్వారా ఆయన ఆశయాలను కొనసాగించడం జరుగుతుందని అన్నారు. మహిళలు అన్ని వర్గాల ప్రజలకు ఓటు హక్కు కచ్చితంగా ఉండాలనే అంబేద్కర్ ఆలోచన రాజ్యాంగం ద్వారా అమలు జరిగిందని గుర్తుకు చేశారు, కొన్నిచోట్ల గ్రామీణ ప్రాంతాలలో కుల వివక్షత నిర్మూలనకు ఖచ్చితంగా చర్యలు తీసుకోవడం జరుగుతుందని అన్నారు, గ్రామపంచాయతీలు, స్థానిక సంస్థలు లోకల్ బాడీలలో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ జయంతి కార్యక్రమాలను నిర్వహిస్తామని కలెక్టర్ తెలిపారు. కోర్ట్ సెంటర్, కలెక్టరేట్ ప్రధాన సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన కార్యక్రమాల్లో తెలంగాణ సాంస్కృతిక సారథి బృందం సభ్యులు డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ పాటల ద్వారా అందరిని ఆకట్టుకున్నారు. ఈ సభలో పాల్గొన్న వివిధ కుల సంఘాల ప్రతినిధులు మహిళా ప్రతినిధులు డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ జయంతి సందర్భంగా తమ సందేశాలను సూచనలను, సలహాలను అందించారు. ఈ జయంతి వేడుకలలో అదనపు కలెక్టర్ రెవెన్యూ కె.అనిల్ కుమార్, మహబూబాబాద్ పట్టణ మున్సిపల్ చైర్పర్సన్ గుగులోతు జ్యోతి, ఎస్సీ కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ శ్రీనివాసరావు, జిల్లా అధికారులు, కౌన్సిలర్లు, కుల సంఘాల నాయకులు ప్రజాప్రతినిధులు మహిళా ఉద్యోగులు ప్రజలు తదితరులు పాల్గొన్నారు.



# ప్రమాదాలు జరగకుండా తగిన జాగ్రత్తలు పాటించాలి

**జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్**

ములుగు జిల్లా, ఏప్రిల్ 14 (తీన్మార్ న్యూస్): అగ్ని మాపకశాఖ నియమాలు పాటిస్తూ.. ప్రమాదాలు జరగకుండా తగిన జాగ్రత్తలు పాటించాలని జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్.సూచించారు. అగ్నిమాపక వారోత్సవాలలో భాగంగా మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరం నందు అగ్ని నివారణ పట్ల అవగాహన పోస్టర్లను జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ 1944 ఏప్రిల్ 14వ తేదీన ముంబాయి డాక్ యార్డులో ఒక నౌకకు అగ్ని ప్రమాదం సంభవించి విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన 66 మంది అగ్నిమాపక దళ సిబ్బందిని స్మరించుకుంటూ ప్రతి సంవత్సరం ఏప్రిల్ 14 నుండి 20వ తేదీ వరకు దేశవ్యాప్తంగా అగ్నిమాపక దళ వారోత్సవాలు నిర్వహించబడుతున్నాయి. హోటళ్లలో అగ్నిమాపక పరికరాలు అన్ని వేళలా పని చేసేలా ఉంచాలని, ప్రతి అంతస్తులో మెట్ల ద్వారాలు, అగ్నిమాపక పరికరాల స్థానం తెలిపే ఎస్కేప్ ప్లాన్ ఉంచాలని తెలిపారు. ఎయిర్ కండిషనర్ ద్వారా మంటలు వ్యాప్తి చెందకుండా డ్యాంపర్స్ ఏర్పాటు చేయాలని వాటిని ఆటోమేటిక్ డిటెక్టివ్ సిస్టంకు అనుసంధానం చేయాలని సూచించారు. విద్యుత్ వైరింగ్, స్విచ్ లు, ఇతర పరికరాలు క్రమం తప్పకుండా చెక్ చేసుకోవాలని ఏమైనా లోపాలు ఉంటే సరి చేసుకోవాలని అన్నారు. సిబ్బంది అందరికీ హోటల్ ఎక్విప్మెంట్ పై శిక్షణ ఇవ్వాలని తెలిపారు. తరచూ మాక్ డ్రిల్స్ నిర్వహించాలని అగ్నిప్రమాద లాంటి అత్యవసర సమయంలో ఏ విధంగా ప్రవర్తించాలో శిక్షణ ఇవ్వాలని పేర్కొన్నారు. వంట గదిలో అగ్నిప్రమాదం జరగకుండా ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని ముఖ్యంగా ఎల్పిజి, సిలిండర్లో ఇతర వస్తువులు భద్రపరిచే చోట తగిన జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. హోటల్లో బస చేసే ముందు అని జాగ్రత్తలు తీసుకోవాలని ముఖ్యంగా ప్రమాద సమయంలో బయటకు వెళ్లే మార్గాలపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. ఈ పోస్టర్ ఆవిష్కరణలో జిల్లా అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు సంపత్ రావు, మున్సిపల్ చైర్పర్సన్ చింతనిప్పుల చంద్రకళ, వైస్ చైర్పర్సన్ అయేషా బేగం, ఆర్డీవో వెంకటేష్, డీఎస్పీ కిషోర్, అగ్నిమాపక శాఖ అధికారి నాగరాజు, స్టేషన్ ఫైర్ ఆఫీసర్ కె. కుమారస్వామి సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



# డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ఆశయాల సాధనకు కృషి చేయాలి

**అంబేద్కర్ చూపిన దారిలోనే దేశ భవిష్యత్ నిర్మాణం**

**ఆశయాల అమలే నిజమైన ఘన నివాళి**

**జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్**

ములుగు జిల్లా, ఏప్రిల్ 14 (తీన్మార్ న్యూస్): డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ ఆశయాల కృషికి ప్రతి ఒక్కరు కృషి చేయాలని, ఆయన చూపిన దారిలోనే ప్రజాస్వామ్య భవిష్యత్తు నిర్మాణమైనదని, మహోన్నత వ్యక్తుల ఆశయాలను అమలు చేయడమే, నిజమైన ఘన నివాళి అని జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్. తెలిపారు. మంగళవారం భారత రాజ్యాంగ నిర్మాత, భారతరత్న డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ 135వ జయంతి ఉత్సవాల సందర్భంగా ములుగు జిల్లా కేంద్రంలో బస్టాండ్ కూడలి వద్ద ఉన్న డా. బాబా సాహెబ్ అంబేద్కర్ విగ్రహానికి జిల్లా కలెక్టర్ దివాకర్ టి.ఎస్. పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం బస్ స్టాండ్ కూడలి అంబేద్కర్ విగ్రహం నుంచి కలెక్టరేట్ సమావేశ మందిరం వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం షెడ్యూల్ కులాల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టరేట్ సమావేశం మందిరంలో డాక్టర్ బిఆర్ అంబేద్కర్ 135వ జయంతి ఉత్సవాల కార్యక్రమాలను అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరై సభాస్థలి సమావేశం మందిరంలో ఏర్పాటుచేసిన భారత రాజ్యాంగ నిర్మాత, భారతరత్న డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల ఘటించి, జ్యోతి ప్రజ్వనలతో ఉత్సవాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్. మాట్లాడుతూ భారతరత్న డాక్టర్ బిఆర్ అంబేద్కర్ దేశానికి చేసిన సేవలు, రాజ్యాంగ నిర్మాణానికి చేసిన కృషి మరువలేనివని, అంబేద్కర్ ఘన కీర్తి ప్రపంచ నలుమూలల వ్యాప్తి చెందడంతో పాటు ప్రపంచానికే మార్గదర్శిగా నిలిచారని కొనియాడారు.



డాక్టర్ అంబేద్కర్ దేశానికి చేసిన సేవలు, సామాజిక న్యాయం కోసం చేసిన అసాధారణ కృషి చిరస్మరణీయమైనవని, సమానత్వం, స్వాతంత్ర్యం, సౌభ్రాతృత్వం అనే రాజ్యాంగ విలువలను ప్రతి పౌరుడూ జీవితంలో ఆచరించాలని పిలుపునిచ్చారు.చదువు, సమీకరించు, పోరాడు అనే నినాదాలతో యువత ముందుకు రావాలని, జ్ఞానం లేని పోరాటం దిశ లేని ప్రయాణం వంటిదని అంబేద్కర్ విశ్వసించేవారని వారి బాటలోనే యువత జ్ఞానాన్ని సంపాదించుకోవాలని సూచించారు. అంబేద్కర్ ఆలోచనలు, ఆయన చూపిన మార్గం యువతకు శాశ్వత ఆదర్శంగా నిలుస్తున్నాయని, విద్య మాత్రమే సామాజిక మార్పు సాధ్యం చేస్తుందని, అన్ని వర్గాల ప్రజ అభివృద్ధికి ఆయన చేసిన సేవలు ఎప్పటికీ మరచిపోలేనివి కొనియాడారు. ఈ సందర్భంగా మున్సిపాలిటీ చైర్ పర్సన్, వైస్ చైర్పర్సన్ మాట్లాడుతూ 135వ అంబేద్కర్ జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించుకోవడం సంతోషకరమైన విషయమని మహానుభావుడు చూపించిన మార్గంలోనే కుల, మత వర్ణ వర్గ ప్రాంత భేదాలు లేకుండా అందరూ కలిసి సమాజ అభివృద్ధిలో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు సంపత్ రావు, మున్సిపల్ చైర్పర్సన్ చింతనిప్పుల చంద్రకళ, వైస్ చైర్పర్సన్ అయేషా బేగం, ఆర్డీవో వెంకటేష్, డీఎస్పీ కిషోర్, ఉత్సవ కమిటీ అధ్యక్షుడు, కార్యవర్గ సభ్యులు, ప్రజా ప్రతినిధులు, జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా మాజీ ఎమ్మెల్యే గండ్ర దంపతుల వివాహ వార్షికోత్సవ వేడుకలు



భూపాలపల్లి, ఏప్రిల్ 14 (తీన్మార్ న్యూస్): భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని బిఆర్ఎస్ పార్టీ జిల్లా కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకట రమణా రెడ్డి, వరంగల్ జిల్లా జడ్పీ మాజీ ఛైర్పర్సన్, భూపాలపల్లి జిల్లా బి ఆర్ ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షురాలు శ్రీమతి గండ్ర జ్యోతిల వివాహ వార్షికోత్సవ వేడుకలను పట్టణ బిఆర్ఎస్ పార్టీ నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు, కార్యకర్తలు కేక్ కట్ చేసి గండ్ర దంపతులకు శుభాకాంక్షలు తెలియజేసి, వారి దాంపత్య జీవితం సుఖశాంతులతో, ఆయురారోగ్యాలతో నిండాలని ఆకాంక్షించారు.

## ఘనంగా అంబేద్కర్ జయంతి వేడుకలు



భూపాలపల్లి, ఏప్రిల్ 14 (తీన్మార్ న్యూస్): భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని బిఆర్ఎస్ పార్టీ జిల్లా కార్యాలయంలో భారత రాజ్యాంగ నిర్మాణ ప్రధాత, భారతరత్న డా.బి.ఆర్ అంబేద్కర్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో బిఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు పాల్గొన్ని అంబేద్కర్ చిత్ర పటానికి పూలమాలవేసి పుష్పాంజలి ఘటించి నివాళులర్పించారు అంబేద్కర్ ఆశయాలను సాధిందామని నినదించారు. అనంతరం జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు

## 4వ బెటాలియన్ ఆవరణలో ఘనంగా అంబేద్కర్ జయంతి వేడుకలు



మామునూరు, ఏప్రిల్ 14 (తీన్మార్ న్యూస్): వరంగల్ జిల్లా మామునూరు నాలుగో బెటాలియన్ ఆవరణలో డా. బి.ఆర్. అంబేద్కర్ జయంతి ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కమాండెంట్ మూర్తుజా రెహమాన్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా అసిస్టెంట్ కమాండెంట్ బెటాలియన్లో డా.బి.ఆర్ అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేశారు. ఈ కార్యక్రమంను ఉద్దేశించి అసిస్టెంట్ కమాండెంట్ మాట్లాడుతూ డా. భీమ్ రావు అంబేద్కర్ భారతదేశ చరిత్రలో అత్యంత ప్రభావంతమైన వ్యక్తులలో ఒకరని, భారత రాజ్యాంగ నిర్మాణంలో కీలక పాత్ర వహించారు.వెనుకబడి, బలహీన వర్గాలకు సమన్యాయం జరిగేలా రాజ్యాంగాన్ని రూపొందించిన గొప్ప రాజ్యాంగ నిర్మాత. అలాగే రిజర్వ్ బ్యాంక్ అఫ్ ఇండియా స్థాపన కొరకు విశేష కృషి చేసిన గొప్ప ఆర్థికవేత్త అని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ వారసత్వాన్ని మనం ప్రతిబింబించేలా మనం ఆయన సాధించిన విజయాలను గౌరవించడమే కాకుండా వారు నడిచిన బాటలో కుల మత లింగ బేధాలు లేకుండా ప్రతి వ్యక్తిని గౌరవంగా చూసే సమాజాన్ని నిర్మించడం కోసం మనమందరం కృషి చేద్దామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కమాండెంట్ వీరన్న, రిజర్వ్ ఇన్స్పెక్టర్లు కార్తీక్, సర్వర్, వెంకటేశ్వర్లు, రాజ్ కుమార్, అధికారులు మరియు బెటాలియన్ సిబ్బంది పాల్గొన్నారు.

## టీడీపీ నేత ఆదిరెడ్డి అప్పారావుకు నిరసన సెగ

**రాజమండ్రి**

టీడీపీ నేత ఆదిరెడ్డి అప్పారావుకు నిరసన సెగ తగిలింది. దళితులపై తీవ్రమైన వ్యాఖ్యలు చేసిన అప్పారావుపై దళిత నేతల ఆగ్రహం వ్యక్తం చేసారు. అంబేద్కర్ జయంతి సందర్భంగా క్వారీ సెంటర్లో విగ్రహానికి పూలమాల వేసేందుకు వచ్చిన ఆదిరెడ్డి అప్పారావు కు అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి అర్హత లేదంటూ దళిత సంఘాలు ఆందోళనకు దిగాయి. టీడీపీ నేతను అడ్డుకునే ప్రయత్నం చేసారు. ఆదిరెడ్డికి వ్యతిరేకంగా ఆందోళనకు దిగారు. దళిత సంఘాల ఆందోళనతో ఆదిరెడ్డి కాన్వాయ్ వెనుతిరిగింది.

## కొలిమిగుండ్లలో అంబేద్కర్ జయంతి వేడుకలు...

**కొలిమిగుండ్ల**

కొలిమిగుండ్ల మండల కేంద్రంలోని మండల తెలుగుదేశం పార్టీ కమిటీ సూచన మేరకు పార్టీ కార్యాలయం, మరియు లక్ష్మీ నగర్ కాలనీలో ఉన్న ఎస్సీ కమ్యూనిటీ హాల్ లో మంగళవారం నాడు డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ 135 జయంతి వేడుకలను టిడిపి నాయకులు, మరియు ఎమ్మార్పీఎస్ నాయకులు కార్యకర్తలు కలిసి ఘనంగా నిర్వహించారు. అనంతరం ఎమ్మార్పీఎస్ నాయకులు అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఆయన ఆశయాలను ప్రతి ఒక్కరూ కొనసాగించాలని ఎమ్మార్పీఎస్ నాయకులు అన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు మందా విజయ్ కుమార్, గోపాల్ గారి దస్తగిరి, ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు శివ నారాయణ, తోళ్ల నాగాంజనేయ, కొండ రామచంద్రుడు, నారాయణ, మందా వెంకటేష్, ఆఫీస్ గోపాల్, ఇంకా తదితర నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# అగ్నిమాపక వారోత్సవాల వాల్ పోస్టర్ ఆవిష్కరణ

జయశంకర్ భూపాలపల్లి జిల్లా, ఏప్రిల్ 14 (తీన్మార్ న్యూస్): జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ సెంటర్‌లో మంగళవారం నిర్వహించిన అంబేద్కర్ జయంతి వేడుకల్లో భాగంగా అగ్నిమాపక వారోత్సవాల వాల్ పోస్టర్‌ను స్థానిక ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు, జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ, ఎస్పీ సంకీర్త్ సంయుక్తంగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా అగ్నిమాపక అధికారి కె.వి. సతీష్ కుమార్ మాట్లాడుతూ, ప్రతి సంవత్సరం ఏప్రిల్ 14 నుండి ఏప్రిల్ 20 వరకు అగ్నిమాపక వారోత్సవాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ వారోత్సవాల్లో భాగంగా వివిధ అవగాహన కార్యక్రమాలు చేపట్టనున్నట్లు వివరించారు. మొదటి రోజు స్థానిక అగ్నిమాపక కేంద్రంలో స్టాల్ ఏర్పాటు చేసి అగ్నిమాపక అమరవీరులకు మౌనం పాటించి నివాళులు అర్పించినట్లు తెలిపారు. రెండవ రోజు ప్రజా ప్రదేశాల్లో అగ్ని ప్రమాదాలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామని చెప్పారు. మూడవ రోజు గృహాల్లో జరిగే ఎల్పిజి మరియు విద్యుత్ అగ్ని ప్రమాదాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తామని, నాలుగవ రోజు ఆసుపత్రుల్లో అగ్ని ప్రమాదాల సమయంలో తీసుకోవాల్సిన చర్యలపై అవగాహన కార్యక్రమాలు చేపడతామని పేర్కొన్నారు. ఐదవ రోజు పెట్రోల్ బంకులు, ఎల్పిజి గోడౌన్లు మరియు పరిశ్రమల్లో అగ్ని ప్రమాదాల నివారణ చర్యలపై అవగాహన కల్పిస్తామని తెలిపారు. ఆరవ రోజు ఫంక్షన్ హాళ్లు, పాఠశాలలు,




కళాశాలలు, సినిమా థియేటర్లు మరియు బహుళ అంతస్తుల భవనాల్లో అగ్ని ప్రమాదాల సమయంలో పాటించాల్సిన జాగ్రత్తలపై కార్యక్రమాలు నిర్వహిస్తామని చెప్పారు. చివరిగా ఏడవ రోజు పాఠశాల, కళాశాల విద్యార్థులకు అగ్ని ప్రమాదాల నివారణపై వ్యాసరచన పోటీలు నిర్వహించి బహుమతులు ప్రదానం చేస్తామని తెలిపారు. వారం రోజులపాటు జరిగే అగ్నిమాపక వారోత్సవాలను ప్రజలు భాగస్వామ్యంతో విజయవంతం చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ట్రేడ్ ప్రమోషన్ చైర్మన్ అయిత ప్రకాష్ రెడ్డి, గ్రంథాలయ సంస్థ చైర్మన్ కోట రాజబాబు, అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, అదనపు ఎస్పీ నరేష్, బీసీ డెవలప్మెంట్ అధికారి ఇందిరా, స్థానిక అగ్నిమాపక అధికారి శ్రీనివాస్, మహదేవ్‌పూర్ అగ్నిమాపక అధికారి రవి, అగ్నిమాపక సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా బి.ఆర్. అంబేద్కర్ 135వ జయంతి వేడుకలు

భూపాలపల్లి, ఏప్రిల్ 14 (తీన్మార్ న్యూస్): మంగళవారం ఉదయం భూపాలపల్లి జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో భారత రాజ్యాంగ నిర్మాత, మహనీయుడు డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ 135వ జయంతి సందర్భంగా ఘనంగా కార్యక్రమం నిర్వహించబడింది. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్, ఐపీఎస్ అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ, డాక్టర్ భీంరావ్ రాంజీ అంబేద్కర్ భారతదేశ చరిత్రలో చిరస్థాయిగా నిలిచే మహనీయుడని పేర్కొన్నారు. ఆయన ప్రతిభావంతమైన న్యాయవాది, ఆర్థిక శాస్త్రవేత్త, రాజకీయ నాయకుడు మాత్రమే కాకుండా గొప్ప సంఘ సంస్కర్తగా సేవలందించారని తెలిపారు. ముఖ్యంగా సమాజంలో ఉన్న అంటరానితనం, కుల వివక్ష నిర్మూలన కోసం జీవితాంతం పోరాడిన మహోన్నత వ్యక్తిగా కొనియాడారు. అలాగే, స్వాతంత్ర్య భారతదేశపు తొలి కేంద్ర న్యాయశాఖ మంత్రిగా పనిచేసి, ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య దేశానికి రాజ్యాంగాన్ని రూపొందించిన రాజ్యాంగ శిల్పిగా అంబేద్కర్ సేవలు అమూల్యమని పేర్కొన్నారు. బడుగు, బలహీన వర్గాల హక్కుల కోసం ఆయన చేసిన కృషి అపారమని, సమానత్వం, న్యాయం, స్వేచ్ఛ వంటి విలువలను సమాజంలో స్థాపించడంలో ఆయన పాత్ర అత్యంత గొప్పదని తెలిపారు. నేటి యువత అంబేద్కర్ ఆశయాలను లోతుగా అర్థం చేసుకుని వాటిని ఆచరణలో పెట్టాలని ఎస్పీ పిలుపునిచ్చారు. సమానత్వం, సామాజిక న్యాయం, విద్య ప్రాముఖ్యత వంటి విలువలను జీవితంలో అనుసరించి మంచి పౌరులుగా ఎదగాలని సూచించారు. దేశాభివృద్ధిలో యువత కీలక పాత్ర పోషించాలంటే అంబేద్కర్



ఆలోచనలను స్ఫూర్తిగా తీసుకుని ముందుకు సాగాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ శ్రీ నరేష్ కుమార్, డీఎస్పీ శ్రీ సంపత్ రావు, ఆర్ఐ రత్నం, ఆర్ఎస్ఐ ఫిరోజ్ తదితర పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# ఘనంగా భారత రత్న డా. బీఆర్ అంబేద్కర్ జయంతి

హనుమకొండ జిల్లా, ఏప్రిల్ 14 (తీన్మార్ న్యూస్): అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించిన గులాబీ శ్రేణులు.జై భీమ్, భారత రాజ్యాంగం వర్ధిల్లాలి అని పెద్దఎత్తున నినాదాలు చేయడం జరిగింది. అనంతరం హనుమకొండ అంబేద్కర్ జంక్షన్ వద్ద అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి అంబేద్కర్ సేవలను కొనియాడారు. కార్యక్రమంలో కార్పొరేటర్ బొంగు అశోక్ యాదవ్, బీఆర్ఎస్ పార్టీ వరంగల్ పశ్చిమ నియోజకవర్గ కన్వీనర్, కో ఆర్డినేటర్ తాళ్లపెల్లి జనార్ధన్ గౌడ్, పులి రజినీకాంత్ ముదిరాజ్, లీగల్ సెల్ అధ్యక్షులు వినోద్ కుమార్, మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షులు నాయీముద్దీన్, డివిజన్ అధ్యక్షులు దువ్వ కనకరాజు ముదిరాజ్, పులి విక్రమ్, వన్నె కోటేశ్వర్ రావు, సీనియర్ నాయకులు జానకిరాములు, సల్వాజి రవీందర్ రావు, నాయకులు కోండ్ర శంకర్, సౌరం రఘు, శ్యామ్ రెడ్డి, పాదిలి అనిల్, పేరుకారి శ్రీధర్ రావు, సురాసి మహేష్, గౌస్ ఖాన్, రమేష్, సాయి, సంపతి రఘు తదితరులు పాల్గొన్నారు

**మంద ప్రవీణ్ కుమార్ ఆధ్వర్యంలో వినూత్న కార్యక్రమం**



భారత రాష్ట్ర సమితి పార్టీ రాష్ట్ర కార్యదర్శి ఆర్ ప్రవీణ్ కుమార్ ప్రధాన అనుచరుడు, స్వేరో సభ్యులు, బీఆర్ఎస్ పార్టీ నాయకులు మంద శ్యామ్ కుమార్ ఆధ్వర్యంలో వినూత్న కార్యక్రమాన్ని చేపట్టారు. హనుమకొండ లోని అంబేద్కర్ సర్కిల్ లోని అంబేద్కర్ విగ్రహం వద్ద కాంగ్రెస్ ప్రభుత్వం బహుజనులకి ఇచ్చిన హామీలు, హామీల అమలు విస్మరించడం పై కరపత్రాలను పంపిణీ చేశారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ లకు కాంట్రాక్టు పనుల్లో రిజర్వేషన్ అమలు చేయకపోవడాన్ని ప్రశ్నించారు. గురుకులాల్లో పిల్లలకు మెరుగైన విద్య అందడం లేదని, నాణ్యమైన భోజనం అందక విద్యార్థులు పడుతున్న ఇబ్బందులను ప్రజలకు తెలిపేందుకే ఈ కరపత్రాల పంపిణీ కార్యక్రమం అని తెలిపారు

# వరంగల్‌లో గుట్కా మాఫియా రాజ్యం

**మూడు పువ్వులు.. ఆరు కాయలు**

**నిర్జన ప్రదేశాల్లో కోట్లాది రూపాయల సరుకు నిల్వ**

**నిఘా కరువు.. కాసుల వర్షం**

వరంగల్ జిల్లా, ఏప్రిల్ 14 (తీన్మార్ న్యూస్):

వరంగల్ జిల్లా కేంద్రంగా ఉమ్మడి వరంగల్ జిల్లావ్యాప్తంగా నిషేధిత గుట్కా వ్యాపారం యథేచ్ఛగా సాగుతోంది. పొగాకు ఉత్పత్తులకు అలవాటుపడిన వారు ఎంత ధరైనా వెచ్చించి కొనుగోలు చేస్తుండడంతో, అక్రమార్కుల వ్యాపారం మూడు పువ్వులు ఆరు కాయలుగా వర్ధిల్లుతోంది. గతంలో ఉన్నంత పోలీస్ నిఘా ప్రస్తుతం లేకపోవడంతో వ్యాపారులు బరితెగిస్తున్నారు. ఒకవేళ పొరపాటున దొరికిపోయినా, ఈ కేసుల్లో గరిష్ఠంగా ఆరు నెలల జైలు శిక్ష లేదా రూ. లక్ష జరిమానా మాత్రమే విధిస్తున్నారు. కొన్ని సందర్భాల్లో రెండు అమలైనా పెద్దగా ప్రభావం చూపడం లేదు. తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభాలు వస్తుండడంతో వ్యాపారులు వెనకడుగు వేయడం లేదు. గణాంకాలను పరిశీలిస్తే..

2024: 342 కేసులు

**2025: 463 కేసులు**

2026 (మార్చి నాటికి) కేవలం 21 కేసులు మాత్రమే నమోదయ్యాయి. కేసుల సంఖ్య ఇంత భారీగా తగ్గడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. గుట్కా నిల్వలు, అక్రమ రవాణాపై పోలీసులు దృష్టి




సారించడం లేదని ఆరోపణలు వస్తున్నాయి. రాజకీయ అండదండలు ఉండడంతో పోలీసులు కేవలం చిన్న చిన్న పాన్ షాపులపై దాడులు చేసి మమ అనిపిస్తున్నారనే చర్చ జరుగుతోంది. నిషేధిత పొగాకు ఉత్పత్తుల కంపెనీలకు వరంగల్ ప్రధాన కేంద్రంగా మారింది. పిన్నవారి వీధి, రామన్నపేట, ఎస్ఆర్ఆర్ తోట మరియు నగర శివారు ప్రాంతాల్లోని నిర్జన ప్రదేశాల్లో, ఖాళీగా ఉన్న ఇళ్లలో కోట్లాది రూపాయల సరుకును నిల్వ చేస్తున్నారు. ?అంబర్, పాన్ బహార్, విమల్, ఆర్ఆర్, రజనీగంధ్, మీరజ్, అనార్ వంటి గుట్కా బ్రాండ్లను నగరానికి దిగుమతి చేసుకుని పక్కా ప్రణాళికతో విక్రయిస్తున్నారు. వరంగల్ పిన్నవారి స్ట్రీట్‌లోని హోల్‌సేల్ వ్యాపారులకు ఈ సరుకును సరఫరా చేస్తున్నారనేది బహిరంగ రహస్యమే. కేవలం చిరు వ్యాపారులను అరెస్టు చేస్తున్న పోలీసులు, కీలకమైన డీలర్లు మరియు హోల్‌సేల్ షాపు యజమానుల పట్ల చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. ప్రజారోగ్యాన్ని దెబ్బతీస్తున్న ఈ పొగాకు ఉత్పత్తుల పట్ల కఠినంగా వ్యవహరించాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

## ప్రగతి ప్రణాళికలో భాగంగా అరైవ్ అలైవ్ కార్యక్రమం



భూపాలపల్లి, ఏప్రిల్ 14 (తీన్మార్ న్యూస్): అంబేద్కర్ జయంతి సందర్భంగా ప్రజా పాలన--ప్రగతి ప్రణాళికలో భాగంగా అరైవ్ అలైవ్ కార్యక్రమం కింద భూపాలపల్లి జిల్లా వ్యాప్తంగా రోడ్డు భద్రతపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించబడినవి. జిల్లాలోని ప్రతి మండలంలో ఎస్ఐలు, సిఐల ఆధ్వర్యంలో అంబేద్కర్ విగ్రహాల వద్ద ప్రజలతో ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని ప్రతిజ్ఞ చేయించడం జరిగింది. భూపాలపల్లి అంబేద్కర్ విగ్రహం వద్ద నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ ,ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు, జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్, ఐపిఎస్ పాల్గొని, అరైవ్ అలైవ్ కార్యక్రమంలో కార్యక్రమంలో భాగంగా ప్రతిజ్ఞ కూడా చేయడం జరిగింది. ఈ సందర్భంగా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్ ఐపిఎస్ మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాల నివారణకు ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని, హెల్మెట్, సీట్ బెల్ట్ వినియోగించాలని సూచించారు. అతివేగం, మొబైల్ వినియోగం వంటి ప్రమాదకర చర్యలను నివారించాలని సూచించారు.

## ఘనంగా అంబేద్కర్ 135 వ జయంతి



భూపాలపల్లి, ఏప్రిల్ 14 (తీన్మార్ న్యూస్): తెలంగాణ రాజ్యాధికార పార్టీ జిల్లా అధ్యక్షులు రవి పటేల్ డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ 135 వ జయంతి సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా రవి పటేల్ మాట్లాడుతు భారతదేశానికి రాజ్యాంగాన్ని అందించిన మహానేత డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ సమానత్వం, న్యాయం, స్వేచ్ఛ కోసం జీవితాంతం పోరాడిన మహోన్నత వ్యక్తి అని కొనియాడారు. సమాజంలో ఉన్న పేదలు, బలహీన వర్గాల అభ్యున్నతికి ఆయన చేసిన సేవలు అపారమని పేర్కొన్నారు. అంబేద్కర్ ఎడ్యుకేట్, ఆగిటేట్, ఆర్గనైజ్ అనే సందేశం ప్రతి ఒక్కరికీ మార్గదర్శకమని తెలిపారు. సమాజంలో ఇంకా కొనసాగుతున్న అసమానతలను తొలగించాలంటే అంబేద్కర్ ఆలోచనలను ప్రతి ఒక్కరూ ఆచరణలో పెట్టాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అంబేద్కర్ ఆశయాల సాధనకు తెలంగాణ రాజ్యాధికార పార్టీ కట్టుబడి ఉందని, సామాజిక న్యాయం కోసం నిరంతరం కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు ఇనుగాల ప్రణయ్ రాజ్ జిల్లా యువజన విభాగ అధ్యక్షుడు బండి సునీల్ యాదవ్ జిల్లా కోఆర్డినేటర్ మామిడి శ్రీకాంత్ వెంకటేష్ లక్ష్మణ్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.ం

## ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా అంబేద్కర్ కి జయంతి

కార్యక్రమంలో పాల్గొన్న స్థానిక సర్పంచ్ చింతల ఉమా



శాయంపేట, ఏప్రిల్ 14 (తీన్మార్ న్యూస్): హనుమకొండ జిల్లా శాయంపేట మండల కేంద్రంలో అంబేద్కర్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో బాబాసాహెబ్ అంబేద్కర్ 135వ జయంతిని రైతు వేదిక పక్కన ఉన్న అంబేద్కర్ స్థలంలో ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా అంబేద్కర్ ఉత్సవ కమిటీ అధ్యక్షులు మారపల్లి క్రాంతి కుమార్ మాట్లాడుతూ బాబా సాహెబ్ ఆలోచన విధానంతో, మరియు వారి ఆశయాలను ముందుకు తీసుకెళ్లడానికి, అదేవిధంగా భారత రాజ్యాంగాన్ని కాపాడుకోవాలని, మరియు ఈ స్థలంలో అంబేద్కర్ భవన నిర్మాణాన్ని తక్షణమే ఏర్పాటు చేయాలని కోరడం జరిగింది.

అదేవిధంగా డీజే చప్పులతో అంబేద్కర్ పాటలతో ర్యాలీ నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ కార్యదర్శి మొగ్గం సుమన్, సహాయ కార్యదర్శి పెంబర్తి భరత్, ఉపాధ్యక్షులు మారపెల్లి సుధాకర్, గౌరవ సభ్యులు అంకేశ్వరపు ఐలయ్య, అరికిల్ల దేవయ్య, రేణుగుంట్ల సదయ్య, కొమ్ముల సతీష్, దైనంపెల్లి సుమన్, మామిడిపెల్లి సాంబయ్య, మారపల్లి మోహన్, నందం, కరుణ్ బాబు, గడిపే విజయ్, ప్రతాప్, ప్రసాద్, ప్రభాకర్, రత్నాకర్, తదితరులు పాల్గొన్నారు.

## అంబేద్కర్ ఒక అరుదైన మాణిక్యం :

శిరివెళ్ల

మండల పరిధిలోని కోటపాడు గ్రామంలో భారతరత్న డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ 135వ జయంతి వేడుకలను తెలుగుదేశం పార్టీ నంద్యాల జిల్లా ఉపాధ్యక్షురాలు కల్లూరి శకుంతలమ్మ శేష ఓబులరెడ్డి మరియు నీటి సంఘం వైస్ చైర్మన్ చింతకుంట్ల బూసిరెడ్డి ఇతర ప్రముఖుల ఆధ్వర్యంలో జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా కల్లూరి శకుంతలమ్మ మాట్లాడుతూ భారతరత్న నవభారత రాజ్యాంగ నిర్మాత అపర మేధావి భారత దేశ తొలి న్యాయశాఖ మంత్రివర్యులు బాబాసాహెబ్ అంబేద్కర్ యొక్క స్ఫూర్తి చైతన్యం క్రమశిక్షణ యువత అలవర్చుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు ప్రముఖులు నాయకులు ప్రజలు పాల్గొన్నారు.

# డీహైడ్రేషన్ నుంచి కాపాడటంలో దీని తర్వాతే ఏదైనా

వేసవి కాలం వచ్చేసింది. ఎండలు తీవ్రమవుతున్న కొద్దీ మన శరీరంలోని నీటి శాతం చెమట రూపంలో వేగంగా తగ్గిపోతుంది. కేవలం నీళ్లు తాగడం మాత్రమే కాకుండా, మనం తీసుకునే ఆహారం ద్వారా కూడా శరీరాన్ని హైడ్రేటెడ్‌గా ఉంచుకోవచ్చు. వేసవి పండ్ల గురించి మాట్లాడేటప్పుడు అందరికీ మొదటగా గుర్తొచ్చేది 'పుచ్చకాయ'. దాదాపు 91 నుండి 92 శాతం నీటిని కలిగి ఉండే పుచ్చకాయ, ఎండల బారి నుండి మనల్ని రక్షించే అద్భుతమైన ఫలమని పోషకాహార నిపుణులు చెబుతున్నారు. పుచ్చకాయ కేవలం దాహాన్ని తీర్చడమే కాకుండా, శరీరానికి అవసరమైన ఎలక్ట్రోలైట్లను అందిస్తుంది. ఎండలో తిరిగేటప్పుడు వచ్చే అలసట, తలనొప్పి వంటి సమస్యలను నివారించడంలో ఇది కీలక పాత్ర పోషిస్తుంది. పుచ్చకాయలో ఉండే అత్యధిక నీటి శాతం మరియు ఎలక్ట్రోలైట్లు శరీరంలో ద్రవాల సమతుల్యతను కాపాడతాయి. ఎండ వేడి వల్ల కలిగే అలసట, మైకము వంటి లక్షణాలను ఇది తగ్గిస్తుంది. ఇందులో ఉండే విటమిన్ సి మరియు లైకోపిన్ వంటి యాంటీ ఆక్సిడెంట్లు ఎండ వల్ల దెబ్బతినే చర్మాన్ని రక్షించి, చర్మం తాజాగా ఉండేలా చేస్తాయి. తక్కువ క్యాలరీలు ఉండటం వల్ల బరువు తగ్గాలనుకునే వారు కూడా దీనిని నిరభ్యంతరంగా తీసుకోవచ్చు. ఇది కడుపుని నిండుగా ఉంచుతూనే శరీరాన్ని తేలికగా ఉంచుతుంది. పుచ్చకాయను ఉదయం పూట స్నాక్‌లా తీసుకోవడం లేదా పండ్ల ముక్కలతో కలిపి సలాడ్‌లా తీసుకోవడం మంచిది. ఎటువంటి చక్కెర కలపకుండా తాజాగా జ్యూస్ చేసుకుని తాగవచ్చు. దీనికి కొద్దిగా పుదీనా ఆకులు కలిపితే రుచితో పాటు చలువ కూడా చేస్తుంది. వేసవిలో వచ్చే ఇతర పండ్లైన కర్బూజ (90%), స్ట్రాబెర్రీ (91%), ఆరెంజ్ (87%) మరియు పైనాపిల్ (86%) లలో కూడా నీటి శాతం ఎక్కువే ఉన్నప్పటికీ, పుచ్చకాయ వీటన్నింటికంటే ముందంజలో ఉంది. అయితే, చాలామంది పండ్ల జాబితాలో దోసకాయను మర్చిపోతుంటారు. నిజానికి దోసకాయలో 95 నుండి 96 శాతం వరకు నీరు ఉంటుంది. ఇందులో ఉండే పొటాషియం వంటి ఖనిజాలు ఎండ తీవ్రత ఎక్కువగా ఉన్నప్పుడు డీహైడ్రేషన్ బారిన పడకుండా శరీరాన్ని అద్భుతంగా కాపాడతాయి. కాబట్టి పుచ్చకాయతో పాటు దోసకాయను కూడా మీ డైట్‌లో చేర్చుకోవడం వల్ల వేసవి తాపాన్ని సులభంగా అధిగమించవచ్చు.

# తక్షణ శక్తికోసం ఏది తినాలి?

మన నిత్య జీవితంలో పనులు చేసుకోవడానికి అవసరమైన కార్బోహైడ్రేట్లు, ప్రోటీన్లు మన ఆహారం ద్వారా అందుతాయి. అయితే మనం తీసుకునే ఆహారం శరీరానికి ఏ సమయంలో, ఎలా శక్తిని ఇస్తుందనేది చాలా ముఖ్యం. కొన్నిసార్లు మనకు తక్షణమే ఉత్సాహం రావాల్సి ఉంటుంది. మరికొన్ని సందర్భాల్లో రోజంతా పని చేయడానికి స్థిరమైన శక్తి అవసరమవుతుంది. అటువంటి సమయాల్లో అరటిపండ్లు, ఖర్జూరాలు మనకు అద్భుతమైన ఎంపికలుగా నిలుస్తాయి. ఈ రెండూ శక్తిని అందించినప్పటికీ, వాటి పోషక విలువలలో ఉండే స్వల్ప తేడాల వల్ల వాటిని తీసుకునే సమయం వేరుగా ఉండాలి. అరటిపండ్ల విషయానికి వస్తే, వీటిలో కార్బోహైడ్రేట్లు అధికంగా ఉంటాయి. ఒక మధ్యస్థ పరిమాణపు అరటిపండులో సుమారు 100 నుండి 150 కేలరీలు ఉంటాయి. వీటిలో సహజ చక్కెరలతో పాటు పిండి పదార్థాలు ఉండటం వల్ల శరీరానికి నిరంతరాయంగా, స్థిరమైన శక్తిని అందిస్తాయి. అంతేకాకుండా అరటిపండ్లలో ఉండే పొటాషియం, విటమిన్ బి6, విటమిన్ సి వంటి పోషకాలు శరీర అవయవాల పనితీరును మెరుగుపరుస్తాయి. ముఖ్యంగా కండరాల పనితీరును మెరుగుపరచడంలో పొటాషియం కీలక పాత్ర పోషిస్తుంది. ఇది వ్యాయామం చేసే సమయంలో వచ్చే కండరాల తిమ్మిర్లను తగ్గించడానికి సహాయపడుతుంది.



మరోవైపు ఖర్జూరాలు తక్షణ శక్తిని అందించడంలో మేటిగా నిలుస్తాయి. కేవలం 3 నుండి 4 ఖర్జూరాలలో 90 నుండి 120 కేలరీలు లభిస్తాయి. వీటిలో సహజ చక్కెరలు పుష్కలంగా ఉండటం వల్ల నీరసంగా ఉన్నప్పుడు లేదా ఉపవాసం ఉన్నప్పుడు తీసుకుంటే వెంటనే ఉత్సాహం వస్తుంది. ఖర్జూరాల్లో చక్కెరతో పాటు ఫైబర్, ఐరన్, మెగ్నీషియం వంటి ముఖ్యమైన ఖనిజాలు కూడా ఉంటాయి. ముఖ్యంగా రక్తహీనత సమస్యతో బాధపడేవారికి ఖర్జూరాలు ఒక అద్భుతమైన పోషకాహారంగా పనిచేస్తాయి. తీవ్రమైన శారీరక శ్రమ చేసేవారికి కూడా ఇవి తక్షణ ఇంధనంలా ఉపయోగపడతాయి. షుగర్ వ్యాధిగ్రస్తులు పండ్ల ఎంపికలో జాగ్రత్తగా ఉండాలి. అరటిపండ్లు మధ్యస్థ గ్లైసెమిక్ ఇండెక్స్ కలిగి ఉండటం వల్ల ఇవి రక్తంలోని చక్కెర స్థాయిని ఒక్కసారిగా పెంచవు. కాబట్టి డయాబెటిస్ ఉన్నవారు వీటిని సాధారణ పరిమాణంలో తీసుకోవడం వల్ల జీర్ణక్రియకు, పేగు ఆరోగ్యానికి మేలు జరుగుతుంది. ఖర్జూరాలకు గ్లైసెమిక్ ఇండెక్స్ చాలా ఎక్కువగా ఉంటుంది, ఇది చక్కెర స్థాయిని వేగంగా పెంచుతుంది. అందుకే మధుమేహ వ్యాధిగ్రస్తులు ఖర్జూరాలకు దూరంగా ఉండటం మంచిది. ఒకవేళ తీసుకోవాలనుకుంటే ఒకటి లేదా రెండు మాత్రమే తీసుకోవాలి, అందులోని ఫైబర్ చక్కెర నియంత్రణకు కొంతవరకు తోడ్పడుతుంది. మన శరీర అవసరాలను బట్టి ఈ రెండింటినీ ఎంచుకోవాలి. సులభంగా చెప్పాలంటే, మీరు వెంటనే రీఛార్జ్ అవ్వాలి అనుకుంటే ఖర్జూరాలు తీసుకోవాలి. అదే మీరు వ్యాయామం చేయాలన్నా లేదా రోజంతా చురుగ్గా ఉండాలన్నా అరటిపండ్లు తీసుకోవడం ఉత్తమం. ఈ రెండింటిలోనూ విటమిన్లు, ఖనిజాలు పుష్కలంగా ఉండటం వల్ల ఇవి మన ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయి. మీ దైనందిన జీవితంలో వీటిని సరైన పద్ధతిలో చేర్చుకోవడం ద్వారా మెరుగైన ఆరోగ్యాన్ని పొందవచ్చు.



# ఖాళీ కడుపుతో నిమ్మరసంలో ఇది కలిపి తాగుతున్నారా?



నేటి వేగవంతమైన జీవితంలో ఆరోగ్యంగా ఉండటం ఒక సవాలుగా మారింది. ఇటువంటి పరిస్థితులలో కొన్ని చిన్న చిన్న చిట్కాలు మన ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తాయి. వాటిలో ఒకటి, పరగడుపున నిమ్మకాయ, తేనె కలిపిన నీటిని తాగడం. ఆరోగ్యకరమైన జీవనశైలిని ప్రారంభించడానికి చాలామంది ఉదయాన్నే నిమ్మరసం-తేనె నీటిని ఎంచుకుంటారు. ఇది ఒక పాతకాలపు పద్ధతి అయినప్పటికీ, దీని వల్ల కలిగే అద్భుత ప్రయోజనాల వల్ల నేటికీ ప్రాచుర్యం పొందుతోంది. కానీ, సరైన పద్ధతిలో పాటించకపోతే, దీని వల్ల కలిగే లాభనష్టాలు కూడా ఉన్నాయని నిపుణులు హెచ్చరిస్తున్నారు. వేడి నీటిలో నిమ్మరసం, తేనె కలపడం వల్ల శరీరంలోని అదనపు కొవ్వు కరుగుతుంది. బరువు తగ్గడానికి ఒక దివ్యౌషధం లాంటిది. ఇది జీర్ణక్రియను మెరుగుపరుస్తుంది. నోటిలోని బ్యాక్టీరియాను చంపడం ద్వారా నోటి దుర్వాసన సమస్యను తగ్గిస్తుంది. నిమ్మరసం కాలేయాన్ని శుభ్రపరచడానికి సహాయపడుతుంది. మీ కాలేయాన్ని శుభ్రంగా ఉంచుకోవడానికి, ఖాళీ కడుపుతో నిమ్మరసం తాగండి. ఆరోగ్య ప్రయోజనాలు: నిమ్మకాయలో విటమిన్ సి పుష్కలంగా ఉంటుంది. ఇది ఇన్ఫెక్షన్ల నుండి శరీరాన్ని రక్షించడమే కాకుండా, సీజనల్ వ్యాధులు దరిచేరకుండా చూస్తుంది. శరీరంలోని వ్యర్థాల, టాక్సిన్లను తొలగించి, రక్తాన్ని శుద్ధి చేస్తుంది. దీనివల్ల చర్మం కాంతివంతంగా మారుతుంది. నిమ్మకాయలో విటమిన్ సి, యాంటీఆక్సిడెంట్లు పుష్కలంగా ఉంటాయి. ఇవి ఆరోగ్యానికి మేలు చేస్తాయి. చాలా మంది ప్రతిరోజూ ఉదయం ఖాళీ కడుపుతో నిమ్మరసం తాగుతారు. పరిమిత పరిమాణంలో తీసుకుంటే ప్రయోజనాలు ఉన్నప్పటికీ, ప్రతిరోజూ ఖాళీ కడుపుతో తాగడం వల్ల ప్రయోజనానికి బదులుగా హాని జరగవచ్చునని నిపుణులు చెబుతున్నారు. నిమ్మరసం ఆరోగ్యానికి మంచిదే అయినప్పటికీ, దానిని తీసుకునే విధానంలో కొన్ని నియమాలు పాటించాలని నిపుణులు హెచ్చరిస్తున్నారు. తీవ్రమైన గ్యాస్ట్రిక్ సమస్యలు ఉన్నవారు పరగడుపున నిమ్మరసం తాగడం వల్ల కడుపులో మంట వచ్చే అవకాశం ఉంది. వీరు అల్పాహారం చేసిన 40 నిమిషాల తర్వాత తీసుకోవడం మంచిది. భోజనానికి ముందు లేదా తిన్న వెంటనే దీనిని తాగకూడదు. అలా చేస్తే మనం తిన్న ఆహారంలోని పోషకాలను శరీరం సరిగ్గా గ్రహించలేదు. నిమ్మరసం నీరు ఒక అద్భుతమైన ఆరోగ్య పానీయం. అయితే పైన పేర్కొన్న జాగ్రత్తలు పాటిస్తూ దీనిని క్రమం తప్పకుండా తీసుకుంటే దీర్ఘకాలిక ఆరోగ్య ప్రయోజనాలను పొందవచ్చు.



## మండుటెండలో చెప్పుల్లేకుండా షూటింగ్.. 'తెరచాప' హిట్ కావాలి

నవీన్ రాజ్ శంకరపు, పూజ సుహాసిని, శ్రీలు ముఖ్యపాత్రలో నటించిన తాజా చిత్రం 'తెరచాప'. అనన్య క్రియేషన్స్ బ్యానర్ పై కైలాష్ దుర్గం నిర్మిస్తున్న ఈ చిత్రానికి జోయల్ జార్జ్ దర్శకత్వం వహిస్తున్నాడు. రాజీవ్ కనకాల, పృథ్వీరాజ్, జగదీష్ ప్రతాప్ బండారి, జబర్దస్త్ అశోక్, నాగి కీలకపాత్రలు పోషించారు. ఏప్రిల్ 17న ఈ చిత్రం విడుదల కాబోతుంది. ఈ నేపథ్యంగా తాజాగా ఈ మూవీ ప్రీరిలీజ్ ఈవెంట్‌ని నిర్వహించారు. ఈ సందర్భంగా రాజీ కనకాల మాట్లాడుతూ..ఈ సినిమాలో నాతోపాటు ఎందరో సీనియర్ నటులు నటించారు. అలాగే కొత్త వారు కూడా నటించారు. మండుటెండలో సముద్ర తీరాన ఇసుకలో చెప్పులు లేకుండా నటించడం అనేది ఎంతో కష్టమైన పరిస్థితి. అటువంటి పరిస్థితులలో కూడా నవీన్ రాజ్ చాలా కష్టపడి నటించారు. శారీరకంగానే కాకుండా మానసిక ఒత్తిళ్లు ఎన్ని ఉన్నా కూడా ఆయన వాటిని ఎదిరించి నిలబడ్డారు. అంత కష్టపడి నటించినా ఈ సినిమాను తన తండ్రికి అంకితం చేస్తున్నాను అని నాతో అన్నప్పుడు నేను ఎంతో ఆనందపడ్డాను.ఈ సినిమా ఘన విజయం సాధించాలని కోరుకుంటున్నాను' అన్నారు. దర్శకుడు సముద్ర మాట్లాడుతూ... "సముద్రతీతంగా అటువంటి పరిస్థితులలో ఒక సినిమా తీయడం అనేది ఎంతో కష్టమైన విషయం. అటువంటి సినిమాను ఈ చిత్రం బృందం అంతా కలిసి ఎంతో పట్టుదలతో పూర్తి చేసి ప్రేక్షకుల ముందుకు రాబోతున్నారు. అందరూ వీరిని ఆశీర్వదించవలసిందిగా కోరుకుంటున్నాను" అన్నారు. 'సినిమా కోసం మేము సముద్ర తీరాన ఎన్నో రోజులు ఎంతో కష్టపడి అక్కడ బ్రతికే మత్స్యకారుల జీవితాలను అర్థం చేసుకొని వారిలో ఒకరిగా కలిసిపోయి చిత్రీకరించాం. ఎంతోమంది ఎన్నో కలలు కని సినిమా తీసినట్లే మేము కూడా చేశాం. మా సినిమాను ప్రేక్షకులు అంతా ఆదరించి మంచి విజయం సాధించేందుకు తోడ్పడుతారని కోరుకుంటున్నాను' అని హీరో నవీన్‌రాజ్ శంకరాపు అన్నారు.

## రాకా.. ఆ నలుగురితో కేక




పుష్ప సినిమాతో అల్లు అర్జున్ పాన్ ఇండియా స్టార్ అయ్యాడు. ఇప్పుడు ఆయన?కు తెలుగులోనే కాదు దేశ వ్యాప్తంగా అభిమానులు ఉన్నారు. వారందరిని మెప్పించే కథలపైనే బన్నీ ఫోకస్ పెట్టాడు. అందులో ఒకటి రాకా. అల్లు అర్జున్ – – అట్లీ కాంబోలో రూపుదిద్దుకొంటున్న తొలి సినిమా ఇది. రూ. 900 కోట్ల భారీ బడ్జెట్‌తో పాన్ ఇండియా స్థాయిలో ఈ సినిమాను తెరకెక్కిస్తున్నారు. షూటింగ్ మొదలైనప్పటి నుంచే ఈ సినిమాపై భారీ అంచనాలు ఏర్పడ్డాయి. ఇక బన్నీ బర్త్‌డే సందర్భంగా విడుదలైన ఫస్ట్ లుక్, టైటిల్ రివీల్ ఆ అంచనాలను మరింత పెంచేశాయి. ఇందులో బన్నీ హీరోగా, విలన్‌గా ద్విపాత్రాభినయం చేస్తున్నాడు. ఇప్పుడు బయటకు వచ్చిన లుక్ విలన్‌ది. హీరో పాత్రకు సంబంధించిన లుక్ చాలా స్టైలీష్‌గా ఉంటుందట. ఇదిలా ఉంటే.. ఇప్పుడు ఈ చిత్రానికి సంబంధించిన మరో ఆసక్తికరమైన విషయం బయటకు వచ్చింది. ఈ సినిమాలు మొత్తం నలుగురు హీరోయిన్లు ఉంటారు. ఇప్పటికే ఒక హీరోయిన్‌గా దీపికా పదుకొణె పేరు బయటకు వచ్చింది.

మరో ముగ్గురు హీరోయిన్లలో రష్మిక, మృణాల్, జాన్వీ కపూర్ పేర్లు బలంగా వినిపిస్తున్నాయి. వీరిలో రష్మిక అల్రేడీ బన్నీతో కలిసి పుష్ప, పుష్ప 2 చిత్రాల్లో నటించింది. మృణాల్, జాన్వీలు తొలిసారి బన్నీతో స్క్రీన్ చేసుకుంటున్నారు. ఇలా ఒకే సినిమాలో నలుగురు హీరోయిన్లతో కలిసి నటించడం బన్నీ కెరీర్‌లోనే తొలిసారి. కథ డిమాండ్ మేరకే నలుగురిని తీసుకున్నారట. అంతేకాదు ఈ నలుగురి పాత్రలు కూడా సినిమాలో కీలకం అట. ఒకవైపు కావాల్సినంత గ్లామర్‌ని చూపిస్తూనే.. మరోవైపు కథలో కీలకంగా వ్యవహరించేలా వీరి పాత్రలను తీర్చిదిద్దినట్లు సమాచారం. ఈ నలుగురూ బన్నీతో ఒకే ఫ్రేమ్ లో కనిపిస్తే మాత్రం ఫ్యాన్స్ పండగ చేసుకోవడం ఖాయం.

## అనుకున్న తేదీకే 'టాక్సిక్'.. పుకార్లను నమ్మవద్దన్న మేకర్స్




కన్నడ స్టార్ నటుడు యశ్ కథానాయకుడిగా గీతూ మోహన్ దాస్ దర్శకత్వంలో రూపొందుతున్న భారీ బడ్జెట్ చిత్రం 'టాక్సిక్'. ఈ సినిమా విడుదల వాయిదా పడిందంటూ గత కొన్ని రోజులుగా సోషల్ మీడియాలో జోరుగా ప్రచారం సాగుతోంది. అయితే ఈ వార్తలపై చిత్ర బృందం తాజాగా స్పందిస్తూ క్లారిటీనిచ్చింది. ఈ సినిమాను అనుకున్న తేదీ ప్రకారమే జూన్ 4 వరల్డ్ వైడ్‌గా విడుదల చేయబోతున్నట్లు చిత్రబృందం తెలిపింది. తొలుత ఈ చిత్రాన్ని 2025 ఏప్రిల్‌లో విడుదల చేయాలని భావించినప్పటికీ ఇరాన్ – ఆమెరికా వార్ నేపథ్యంలో వాయిదా వేసుకుంది. ప్రస్తుతం యశ్ ఈ సినిమా ప్రమోషన్ల కోసం అమెరికాలోని లాస్ వెగాస్‌లో జరుగుతున్న ప్రతిష్టాత్మక 'సినీమాకాన్' వేడుకలో పాల్గొంటున్నారు. దీనిని కేవలం పాన్–ఇండియా స్థాయిలోనే కాకుండా గ్లోబల్ మార్కెట్‌లోనూ భారీగా విడుదల చేసేందుకు టీమ్ ప్లాన్ చేస్తోంది. 1940 నుండి 1970 మధ్య కాలంలో గోవా గ్యాంగ్‌స్టర్ నేపథ్యంలో సాగే ఈ యాక్షన్ డ్రామాలో నయనతార, కియారా అద్వానీ, హ్యూమా ఖురేషీ వంటి అగ్ర తారలు నటిస్తున్నారు.

## 'డ్రాగన్' కోసం ఆలియా?.. ప్రశాంత్ నీల్ సినిమాలో బాలీవుడ్ బ్యూటీ!



జూనియర్ ఎన్టీఆర్, దర్శకుడు ప్రశాంత్ నీల్ కాంబినేషన్‌లో రాబోతున్న సినిమాపై భారీ అంచనాలు నెలకొన్న విషయం తెలిసిందే. ప్రస్తుతానికి 'డ్రాగన్' అనే వర్కింగ్ టైటిల్‌తో రాబోతున్న ఈ సినిమాలో బాలీవుడ్ స్టార్ హీరోయిన్ ఆలియా భట్ ఒక శక్తివంతమైన కీలక పాత్రలో నటించబోతున్నట్లు సమాచారం. గతంలో రాజమౌళి తెరకెక్కించిన '===' చిత్రంలో తారక్, ఆలియా కలిసి నటించి మెప్పించగా, మరోసారి ఈ జంట వెండితెరపై కనిపించబోతుండటం అభిమానుల్లో ఉత్సాహాన్ని నింపుతోంది. ఈ సినిమాలో ఆలియా భట్ కేవలం గ్లామర్ పాత్రకే పరిమితం కాకుండా, కథను మలుపు తిప్పే ప్రాధాన్యత ఉన్న పాత్రలో కనిపిస్తారని సమాచారం. ఇప్పటికే కన్నడ నటి రుక్మిణి వసంత్ ఈ చిత్రంలో కథానాయికగా ఎంపికైనట్లు ప్రచారం జరుగుతుండగా, ఆలియా కూడా చేరితే సినిమాలో ఇద్దరు హీరోయిన్లు ఉండే అవకాశం ఉంది. దర్శకుడు ప్రశాంత్ నీల్ ఇప్పటికే ఆలియాను సంప్రదించారని, దానికి ఆమె సానుకూలంగా స్పందించారని టాక్ నడుస్తోంది, అయితే దీనిపై చిత్ర యూనిట్ నుంచి అధికారిక ప్రకటన రావాల్సి ఉంది. ప్రస్తుతం శరవేగంగా షూటింగ్ జరుపుకుంటున్న ఈ సినిమా కోసం ఎన్టీఆర్ ప్రత్యేకంగా 'కలరిపయట్టు' వంటి మార్షల్ ఆర్ట్స్‌లో శిక్షణ పొందుతున్నారు. ప్రశాంత్ నీల్ మార్క్ హై–వోల్టేజ్ యాక్షన్‌కు ఆలియా వంటి టాలెంటెడ్ నటి తోడైతే, ఈ పాన్–ఇండియా చిత్రం బాక్సాఫీస్ వద్ద సరికొత్త రికార్డులు సృష్టించడం ఖాయమని విశ్లేషకులు భావిస్తున్నారు.

## 'డెకాయిట్' మూవీపై రామ్ చరణ్ ప్రశంసల జల్లు.. అడివి శేష్ నటన అద్భుతమంటూ ట్వీట్!




అడివి శేష్, మృణాల్ ఠాకూర్ ప్రధాన పాత్రల్లో నటించిన మోస్ట్ అవేటెడ్ మూవీ 'డెకాయిట్' పై మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ ప్రశంసల జల్లు కురిపించారు. తాజాగా ఈ సినిమాను వీక్షించిన ఆయన, సోషల్ మీడియా వేదికగా తన రివ్యూను పంచుకుంటూ చిత్ర బృందాన్ని అభినందించారు. హరి పాత్రలో అడివి శేష్ అద్భుతమైన నటనను కనబరిచారని, ఆయన పెర్ఫార్మెన్స్ ప్రేక్షకుల మదిలో చిరస్థాయిగా నిలిచిపోతుందని చరణ్ కొనియాడారు. అలాగే మృణాల్ ఠాకూర్ తన నటనతో పాత్రకు ప్రాణం పోశారని, ఈ సినిమాలో ఆమె నటన ఎంతో లోతుగా ఉందంటూ మెచ్చుకున్నారు. బాలీవుడ్ దిగ్గజ దర్శకుడు అనురాగ్ కశ్యప్‌తో పాటు ఇతర నటీనటులందరూ తమ ప్రదర్శనతో సినిమాను మరో స్థాయికి తీసుకెళ్లారని ఆయన పేర్కొన్నారు. ముఖ్యంగా అన్నపూర్ణ స్టూడియోస్ బ్యానర్‌పై సుప్రియ యార్లగడ్డ ఈ చిత్రాన్ని అత్యున్నత సాంకేతిక ప్రమాణాలతో, రాజీ పడకుండా నిర్మించిన తీరును చరణ్ ప్రత్యేకంగా అభినందించారు. సాంకేతికంగా సినిమా ఎంతో రిచ్‌గా ఉందని, టీమ్ మొత్తం పడ్డ కష్టానికి తగిన ఫలితం దక్కిందని ఆయన తెలిపారు. రామ్ చరణ్ స్వయంగా సినిమాను మెచ్చుకుంటూ పోస్ట్ చేయడంతో 'డెకాయిట్' పై ప్రేక్షకుల్లో అంచనాలు రెట్టింపయ్యాయి. వరుస విజయాలతో దూసుకుపోతున్న అడివి శేష్ ఖాతాలో ఈ చిత్రం మరో భారీ విజయంగా నిలుస్తుందని ఇండస్ట్రీ వర్గాలు భావిస్తున్నాయి. ప్రస్తుతం ఈ మెగా ప్రశంసలు సోషల్ మీడియాలో హాట్ టాపిక్‌గా మారాయి.

Editor, Publisher & Owner by Reddy Shekar, 3-184, venkatapur, (m) venkatapur, mulugu dist, 506352, Printed at 16-48 SS Printers, (m) mulugu, mulugu. RNI No. TELTEL/2021/86151, E Mail : teenmaardesk@gmail.com, Cell : 9966847463